www.vishalabharati.com
epaper:vishalabharati.com

ఆదివారం, 21.04.2023
హైదరాబాద్
సంపుటి: 2, సంచిక: 189

విశాల భారతి
తెలుగు దిన పత్రిక

# కమర్షియల్ స్పేస్ హాట్ గురూ!

- ఐటీ కేంద్రంగా కో వర్కింగ్ అండ్ కో లివింగ్ స్పేస్
- కమర్షియల్ ఏరియాల నోటిఫైతో పెరిగిన వాణిజ్య లావాదేవీలు
- బెంగుళూరు, హైదరాబాద్ నగరాల్లోని కమర్షియల్ స్పేస్‌కు డిమాండ్

వివరాలు రియల్ టాక్ 3లో







## బిడ్డా కేసీఆర్..

# ఉరికిచ్చి కొడతాం

- మా ప్రభుత్వాన్ని పడగొడతావా?
- ఇక్కడున్నది జానారెడ్డి, జైపాల్ రెడ్డి కాదు
- హైటెన్షన్ వైర్ లాంటి రేవంత్ రెడ్డి
- కాంగ్రెస్ పని అయిపోయిందంటున్నావు
- అదేమైనా ఫుల్ బాటిల్ అనుకున్నావా?
- మెదక్ గడ్డపై ప్రజలు ఇందిరమ్మను గెలిపించారు
- నీలం మధును కూడా గెలిపించాలి
- నీలం మధు నామినేషన్ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

"కరెంట్ వైర్ కూడా నా లాగా సన్నగా ఉంటది , దాన్ని టచ్ చేస్తే షాకే సాలిడ్ గా ఉంటుంది " అంటూ ఊసరవెల్లి సినిమాలో ఎన్టీఆర్ చెప్పిన డైలాగుల్ని రేవంత్ రెడ్డి.. రాజకీయ ప్రసంగాల్లో తనకు అన్వయించుకుని ..కేసీఆర్ హెచ్చరిస్తున్నారు. మెదక్ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్ నామనేషన్ కార్యక్రమంలో రేవంత్ పాల్గొని తర్వాత జరిగిన బహిరంగసభలో ప్రసంగించారు. కాంగ్రెస్ పార్టీ పని అయిపోయిందని పిట్టలదొర కేసీఆర్ అంటుండు.. అదేమైనా నువు తాగే ఫుల్ బాటిలా అయిపోవడానికి. ఇక్కడున్నది రేవంత్ రెడ్డి.. హైటెన్షన్ కరెంట్ వైర్.. బిడ్డా టచ్ చేసి చూడు.. చూస్తూ ఊరుకోవడానికి నేను జైపాల్ రెడ్డి, జానారెడ్డిని కాదు.. మా ప్రభుత్వాన్ని పడగొడతామంటే ఉరికించి కొడతా జాగ్రత్త' అంటూ కేసీఆర్ కు సీఎం రేవంత్ రెడ్డి మాస్ వార్నింగ్ ఇచ్చారు. కారు పని అయిపోయిందని కార్ఖానాకు పోయిందని.. ఇక బయటకు రాదన్నారు. వచ్చే పదేళ్లు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్ పని అయిపోయిందని అన్నారు. దేశంలో కాంగ్రెస్ పార్టీ కష్టాల్లో ఉన్నప్పుడు ఆనాడు ఇక్కడి ప్రజలు మెదక్ గడ్డపై ఇందిరమ్మను గెలిపించారని సీఎం రేవంత్ రెడ్డి ప్రజలకు గుర్తుచేశారు. 1999 నుంచి 2024 వరకు 25 సంవత్సరాలు మెదక్ పార్లమెంట్ బీజేపీ, బీఆరెఎస్ చేతిలోనే ఉందన్నారు. ఆనాడు ఇందిరమ్మ తెచ్చిన పరిశ్రమలు తప్ప.. బీజేపీ, బీఆరెఎస్ ఈ ప్రాంతానికి చేసిందేం లేదని విమర్శించారు. పదేళ్ల బీఆరెఎస్ పాలనలో మెదక్ ప్రజలకు ఒరిగిందేం లేదు అని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. 'దుబ్బాకలో గెలిపిస్తే కేంద్రం నుంచి నిధులు తెస్తానన్న రఘునందన్ రావును అడుగుతున్నా.. మేమంతా బస్సు లేసుకుని దుబ్బాక వస్తాం. నువ్వు తెచ్చిన నిధులేంటో.. చేసిన అభివృద్ధి ఏంటో చూపించు. పదేళ్లు మోదీ ప్రధానిగా ఉన్నారు. కేసీఆర్ సీఎం గా ఉన్నారు. ఈ పదేళ్లలో వీళ్లు తెచ్చిన పరిశ్రమలు ఎన్ని? చేసిన అభివృద్ధి ఏంటో చెప్పాకే ఓట్లు అడగాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించాం అని సీఎం రేవంత్ రెడ్డి వెల్లిడించారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా పేదలకు రూ.10 లక్షల వరకు ఉచిత వైద్యాన్ని అందించే ప్రజా పాలన కాంగ్రెస్ సొంతం అని తెలిపారు. రూ.22,500 కోట్లతో పేదలకు ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు అందిస్తున్నాం, రూ.500లకే గ్యాస్ సిలిండర్ అందించి ఆడబిడ్డలను ఆదుకుంటున్నాం అని అన్నారు. తాము ఆడబిడ్డల కళ్లలో ఆనందం చూస్తుంటే.. కడుపు మండిన మోదీ, కేసీఆర్ కాంగ్రెస్ ను ఓడించేందుకు కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. ప్రతీ పేదవాడికి సంక్షేమ ఫలాలను అందించే బాధ్యత తమదని భరోసా ఇచ్చారు. మల్లన్న సాగర్, రంగనాయక్ సాగర్ రైతుల భూములు గుంజుకున్న దుర్మార్గుడు బీఆరెస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి అని ఫైర్ అయ్యారు.

# రాహుల్‌కి వయనాడ్‌లోనూ కష్టమే

- మహారాష్ట్ర నాందేడ్‌లో సభలో ప్రధాని నరేంద్ర మోదీ
- ఇండియా కూటమి నేతలు ఒకరినొకరు దూషించుకుంటున్నారు

**విశాలభారతి,నేషనల్ బ్యూరో:**

అమేఠీ నుంచి పారిపోయిన కాంగ్రెస్ యువరాజు వయనాడ్‌లోనూ గడ్డుపరిస్థితులు ఎదుర్కొంటున్నారని ప్రధాని నరేంద్ర మోదీ ఎద్దేవా చేశారు. ఈనెల 26న అక్కడ పోలింగ్ మిగతా 2లో



# పార్టీ మారడం లేదు

- ఆ ఉద్దేశ్యమే లేదు
- ఇటీవల రేవంత్ ను కలిసి ప్రకాశ్ గౌడ్
- రేపో మాపో పార్టీ మారబోతున్నారంటూ జోరుగా ప్రచారం
- సడెన్ ట్విస్ట్ ఇచ్చిన ప్రకాశ్ గౌడ్

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

రాజేంద్రనగర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పార్టీ మార్పుపై యూటర్న్ తీసుకున్నారు. తాను కాంగ్రెస్ లో చేరబోనని.. బీఆర్ఎస్ లోనే కొనసాగుతానని స్పష్టం చేశారు. శుక్రవారం సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన ఆయన.. తాను కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నానని సీఎంతో చెప్పినట్లు ప్రచారం సాగింది. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం, శనివారం ఉదయం పార్టీ కేడర్ తో సమావేశమైన ఆయన పార్టీ మిగతా 2లో



# ఒకటో తేదీన జీతాలు పడుతున్నాయా?

- గురుకుల టీచర్లకు ఎందుకు రావడం లేదు
- కాంగ్రెస్ మాటలు కోటలు దాటుతున్నాయి
- ఆచరణ కడపదాటడం లేదు
- కాంగ్రెస్ సర్కారు వెంటనే పెండింగ్ వేతనాలు చెల్లించాలి
- సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు



వివరాలు 2లో

# రేవంత్.. రుణమాఫీ చేయకపోతే సీఎం పదవికి రిజైన్ చేస్తారా?

- నా బాగోతం చెబుతానంటావా?
- నీ చరిత్ర ఏంటో ప్రజల ముందు బయటపెడతా
- నీ తల్లి, చెల్లిని అడిగితే ఆడది అంటే ఏంటో చెప్తారు
- రేవంత్ రెడ్డికి ఓటమి భయం పట్టుకున్నది
- అందుకే ఐదు సార్లు ఈ ఏరియాకు వచ్చారు
- బీజేపీ నేత డీకే అరుణ

వివరాలు 2లో



# బీఆర్ఎస్ పార్టీ కష్టాల్లో ఉంది

- పార్టీలో నిర్మాణం, అంతర్గత ప్రజాస్వామ్యం లోపించింది
- ఆరు నెలలుగా కేసీఆర్‌ను కలవడానికి ప్రయత్నించాను
- శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి



వివరాలు 2లో

# అకాల వర్షాలు, వడగళ్ల వానలతో పంట నష్టం

- పంట నష్టంపై మంత్రి ఆరా
- 2200 ఎకరాల్లో పంటలకు నష్టం
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

రాష్ట్రంలో గత రెండు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలు, వడగళ్ల వానల వల్ల పంట నష్టం వాటిల్లినట్లు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. నారాయణపేట, కామారెడ్డి, నిజామాబాద్, నాగర్ కర్నూల్, యాదాద్రి భువనగిరి, సిద్దిపేట జిల్లాల్లో పంట నష్టం జరిగినట్లు ప్రాథమిక నివేదికలు అందాయని తెలిపారు. తాజాగా కురిసిన అకాల వర్షాలు, వడగళ్ల వానల ప్రభా వం, సంభవించిన పంట నష్టంపై మంత్రి ఆరా తీశారు. దాదాపు 2200 ఎకరాల వరకు వరి, మొక్కజొన్న, ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లినట్లు ప్రాథమికంగా అంచనా వేశామని చెప్పారు.పంట నష్టం సంభవించిన ప్రాంతాలను వెంటనే సందర్శించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. పూర్తి స్థాయిలో పంట నష్టపోయిన రైతుల వివరాలు వెంటనే మిగతా 2లో



# డిపాజిట్ కోసమే బీఆర్ఎస్ తాపత్రయం

- కూతురు లిక్కర్ స్కామ్‌లో...
- పార్టీ ఫోన్ ట్యాపింగ్ కేసులో..
- గెలిచిన ఎమ్మెల్యేలనూ నిలబెట్టుకోలేకపోతున్న పార్టీ
- స్థానిక ఎన్నికల కోసమే కాంగ్రెస్ రుణమాఫీ డ్రామ
- పంద్రాగస్టు డెడ్‌లైన్ అందుకోసమే
- కాంగ్రెస్ బడే మియా.. బీఆర్ఎస్ ఛోటే భాయ్
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



**విశాలభారతి,స్టేట్ బ్యూరో :**

ఈ పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ డిపాజిట్ కోసమే తాపత్రయపడుతోందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. కేసీఆర్ కూతురు.. బీరు, బ్రాండీ స్కామ్ లో, బీఆర్ఎస్ ఫోన్ ట్యాపింగ్ స్కామ్ లో ఇరుక్కుందని ఆయన విమర్శలు చేశారు. నాంపల్లి బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ రోజు రోజుకూ కనుమరుగవుతోందని పేర్కొన్నారు. కొందరు నేతలు పార్టీలు మారడంతో ప్రజలు అసహ్యించుకుంటున్నారని, కేసీఆర్ కు కూడా ఇది ఇబ్బంది పెడుతున్నట్లు ఉందని, అందుకే ఫ్రస్టేషన్ లో మాట్లాడుతున్నారన్నారు. బీఆర్ఎస్ ఓడిపోయి 5 నెలలు కావస్తున్నా కేసీఆర్, కేటీఆర్ ఓటమిని జీర్ణించుకోలేకపోతున్నారన్నారు. జైశ్రీరామ్ అన్నం పెడుతుందా అని వ్యాఖ్యానించిన కేటీఆర్.. ఇటీవల జై శ్రీరామ్ అంటూ బీజేపీని తొక్కాలని అన్నాడని, కామారెడ్డిలో కేసీఆర్ ను బీజేపీ తొక్కింది సరిపోలేదా? అని ఆయన మండిపడ్డారు. మిగతా 2లో

విశాలభారతి
తెలుగు దిన పత్రిక
GENERAL NEWS
జనరల్ న్యూస్
vishalabharathi Telugu Daily
www.vishalabharati.com
epaper:vishalabharati.com
2
ఆదివారం, 21.04.2023
హైదరాబాద్

# డిపాజిట్ కోసమే బీఆర్ఎస్ తాపత్రయం

**మొదటిపేజీ తరువాయి**

కాంగ్రెస్ నేతలు సోనియమ్మ, ఇందిరమ్మ, రాహుల్ రాజ్యం వస్తుందని ఒక్కొక్కరు ఒకొక్కటి చెబుతున్నారని కిషన్ రెడ్డి విమర్శలు చేశారు. ఎన్నికల కోడ్ ను సాకుగా చెబుతూ పథకాల అమలును దాటవేస్తున్నారని ఫైరయ్యారు. ఎన్నికల షెడ్యూల్ కు ముందే 100 రోజులు దాటిందని, అప్పుడు ఎందుకు అమలు చేయలేదో చెప్పాలని ఆయన ప్రశ్నించారు. జూన్ 4న కోడ్ ముగుస్తుందని, జూన్ 5కి పథకాలు అందజేయొచ్చు కదా అని నిలదీశ్వారు. ఆగస్టు వరకు పెండింగ్ పెట్టడం ఎందుకని ధ్వజమెత్తారు. స్థానిక సంస్థల ఎన్నికల తరువాత ప్రజలను మోసం చేయాలని కాంగ్రెస్ చూస్తోందని విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ దగాకోర్ పార్టీ అంటూ ఘాటు విమర్శలు చేశారు. ఆరు గ్యారెంటీలు అమలు చేసే వరకు కాంగ్రెస్ కు ప్రజలు ఓటు వేయొద్దని కిషన్ రెడ్డి కోరారు. బీజేపీలో చేరితే బెయిల్ లభిస్తుందని, అందుకే ఆ పార్టీలో చేరుతున్నారని రేవంత్ చేసిన వ్యాఖ్యలపై కిషన్ రెడ్డి విరుచుకుపడ్డారు. జైల్లో ఉన్నవారికి బీజేపీ బెయిల్ ఇవ్వదని, తెలంగాణలో ముఖ్యమంత్రే బెయిల్ ఇస్తున్నాడా? అని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ దొందు.. దొందేనని, కాంగ్రెస్ బడే మియా.. అయితే బీఆర్ఎస్ చోటా భాయ్ అంటూ ఫైరయ్యారు. కేసీఆర్ కూడా కాంగ్రెస్ బ్రాండేనని కిషన్ రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ లో వరంగల్ టికెట్ ఇచ్చినా పార్టీ మారారని, బీఆర్ఎస్ తీరు అలా ఉందని, అందుకే ఆ పార్టీకి ఓటు వేయొద్దన్నారు. ఎవరూ పార్టీ మారరని కేసీఆర్ గ్యారెంటీ ఇవ్వగలడా అని ఆయన ప్రశ్నించారు. నాలుగున్నరేండ్ల తరువాత కాంగ్రెస్ కనుమరుగవ్వడం ఖాయమని కిషన్ రెడ్డి జోస్యం చెప్పారు. రేవంత్ ముఖ్యమంత్రి అనే విషయం తెలుసుకుని మాట్లాడాలని, ఇప్పటికీ ప్రతిపక్షంలో ఉన్నట్లుగా మాట్లాడుతున్నాడని మండిపడ్డారు. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా భారీ సభలు, సమావేశాల కంటే డోర్ టు డోర్ ప్రచారానికే ప్రాధాన్యత ఇస్తున్నట్లు కిషన్ రెడ్డి చెప్పారు. ఇదిలా ఉండగా ఈ సమావేశంలో అనంతరం బీజేపీ భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి బూర నర్సయ్య గౌడ్ కు కిషన్ రెడ్డి బీ ఫామ్ అందజేశారు.

# ఒకటో తేదీన జీతాలు పడుతున్నాయా?

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఒకటో తేదీనే జీతాలు ఇస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకటో తేదీనే జీతాలిస్తే.. గురుకులాల్లో పని చేస్తున్న కంప్యూటర్ టీచర్లకు మూడు నెలలుగా జీతాలు ఎందుకు అందడం లేదని నిలదీశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాటలు కోటలు దాటుతున్నాయి కానీ ఆచరణ గడప దాటడం లేదని హరీశ్‌రావు ధ్వజమెత్తారు. ఉద్యోగులకు 1వ తేదీనే జీతాలిస్తున్నామని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రచారం చేసుకుంటున్నది. కానీ వాస్తవం మాత్రం అందుకు పూర్తి విరుద్ధంగా ఉందని హరీశ్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా గురుకులాల్లో పని చేస్తున్న ఐసీటీ కంప్యూటర్ టీచర్లకు మూడు నెలలుగా జీతాలు అందడం లేదని ఆయన పేర్కొన్నారు. దీంతో వారు అప్పుల పాలై అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఆ కుటుంబాలు రోడ్డునపడుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి పెండింగ్ జీతాలను వెంటనే చెల్లించాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నామని హరీశ్‌రావు స్పష్టం చేశారు. నిర్మల్ జిల్లా నర్సాపూర్ మండలం కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో 11 మంది విద్యార్థినులు తీవ్ర అస్వస్థతకు గురైన సంగతి తెలిసిందే. ఈ ఘటనపై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ట్విట్టర్ వేదికగా స్పందించారు. మొన్న భువనగిరి గురుకుల హాస్టల్లో కలుషిత ఆహారం తిని చనిపోయిన ప్రశాంత్ ఉదంతాన్ని మరవక ముందే మరో ఫుడ్ పాయిజన్ ఉదంతం వెలుగులోకి రావడం దారుణమన్నారు. నిర్మల్ జిల్లా నర్సాపూర్ మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో శుక్రవారం 11 మంది విద్యార్థినులు కలుషిత ఆహారం తిని తీవ్ర అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చేరారని ఆయన పేర్కొన్నారు. బీఆర్ఎస్ పాలనలో దేశానికే ఆదర్శంగా నిలిచిన తెలంగాణ గురుకులాల పట్ల కాంగ్రెస్ నిర్లక్ష్య వైఖరికి ఈ ఉదంతాలు అద్దం పడుతున్నాయని ధ్వజమెత్తారు. ప్రభుత్వం వెంటనే బాధిత విద్యార్థులకు మెరుగైన చికిత్స అందించాలి. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

# బీజేపీ సీనియర్ నేత కువర్ సర్వేశ్ కుమార్ మృతి

- ప్రస్తుతం మురాదాబాద్ లోక్ సభ పోటీ
- గొంతు సంబంధిత వ్యాధి,గుండెపోటుతో మృతి
- మోదీ, సీఎం యోగి సంతాపం

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**



ఉత్తర్ ప్రదేశ్ మురాదాబాద్ లోక్సభ స్థానం కోసం బరిలో దిగిన బీజేపీ సీనియర్ నేత కువర్ సర్వేశ్ కుమార్ మరణించారు. ఆయన మృతి పట్ల ప్రధాని మోదీ, సీఎం యోగి ఆదిత్యనాథ్ సంతాపం వ్యక్తం చేశారు.లోక్ సభ ఎన్నికల్లో భాగంగా ఉత్తర్ ప్రదేశ్ మురాదాబాద్ ఎంపీగా పోటీ చేసిన బీజేపీ అభ్యర్థి కువర్ సర్వేశ్ కుమార్(72) గుండెపోటుతో మరణించారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన, దిల్లీలోని ఎయిమ్స్ ఆస్పత్రికి చికిత్స పొందుతూ శనివారం కన్నుమూశారు. ఈ విషయాన్ని యూపీ బీజేపీ చీఫ్ భూపేంద్ర చౌధరీ వెల్లడించారు. సర్వేశ్కు గొంతు సంబంధిత వ్యాధితో కొన్నిరోజులుగా బాధపడుతున్నారని, ఇటీవల ఆపరేషన్ కూడా జరిగిందని చెప్పారు. అయితే లోక్సభ ఎన్నికల తొలి దశలో మురాదాబాద్ నియోజకవర్గానికి శుక్రవారం పోలింగ్ జరిగింది. 60.60 శాతం ఓటింగ్ నమోదైంది. కున్వర్ సర్వేశ్ కుమార్ ఓటు కూడా వేశారు. అనంతరం ఎయిమ్స్ చికిత్స కోసం చేరారు. ఓటింగ్ జరిగిన తర్వాతే రోజు సర్వేశ్ మరణించడం, ఆయన అనుచరులతోపాటు పార్టీ కార్యకర్తల్లో తీవ్ర విషాదం నింపింది. సర్వేశ్ కుమార్ మృతి పట్ల ప్రధాని నరేంద్ర మోదీతోపాటు యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఎక్స్ (ట్విట్టర్) వేదికగా సంతాపం తెలిపారు. కువర్ సర్వేశ్ సింగ్ మృతి పట్ల ప్రధాని మోదీ సంతాపం వ్యక్తం చేశారు. "మురాదాబాద్ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేసిన బీజేపీ అభ్యర్థి, మాజీ ఎంపీ కువర్ సర్వేశ్ సింగ్ అకాల మరణం పట్ల తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేస్తున్నా. ఆయన తన చివరి శ్వాస వరకు ప్రజాసేవకు, సామాజిక సేవకే అంకితమయ్యారు. ఆయన మరణం కోలుకోలేనిది. సర్వేశ్ కుటుంబానికి తట్టుకునే శక్తిని ఇవ్వాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నాను" అని మోదీ ట్వీట్ చేశారు.

# బీఆర్ఎస్ పార్టీ కష్టాల్లో ఉంది

**విశాల భారతి,స్టేట్ బ్యూరో:**

రాష్ట్రంలో పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ఇవాళ కష్టాల్లో ఉందని శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. పార్టీలో నిర్మాణం, అంతర్గత ప్రజాస్వామ్యం లోపించిందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే సెంట్రిక్గా రాజకీయాలు చేయడం వల్లే ఇవాళ బీఆర్ఎస్ కష్టాల్లో పడిందని తెలిపారు. ఇతర పార్టీలకు వెళ్లిన ఇద్దరు ఎమ్మెల్సీలపై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ నేతలు ఫిర్యాదు చేశారని, దానిపై న్యాయబద్ధంగా, రాజ్యాంగబద్ధంగా నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఇవాళ నల్గొండ జిల్లా ఉరుమడ్లలో నిర్వహించిన మీడియా సమావేశంలో గుత్తా సుఖేందర్‌రెడ్డి మాట్లాడారు. తాను పార్టీ మారుతున్న అనేది అవాస్తవమని, రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్నానని గుత్తా వివరించారు. అమిత్ రెడ్డికి ఎంపీ టికెట్ ఇవ్వలేదనేది పూర్తిగా అవాస్తవమన్నారు. స్వయంగా కేసీఆర్ ఫోన్ చేసి అమిత్‌ను ఎంపీగా పోటీ చేయాలని కోరారని తెలిపారు. దీనిపై జిల్లాలోని నాయకులు కొంతమంది సహకరిస్తామన్నారని, మరి కొంతమంది తామే పార్టీ మారుతున్నామని చెప్పారని పేర్కొన్నారు. అందుకే పోటీ నుంచి అమిత్ తప్పుకున్నారని గుత్తా సుఖేందర్‌రెడ్డి తెలిపారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఆరు నెలలుగా కేసీఆర్‌ను కలవడానికి ప్రయత్నించినా సాధ్యపడలేదన్నారు. పార్టీ నిర్మాణం, సమీక్ష లేకపోవడం వల్లే బీఆర్ఎస్కు ఈ పరిస్థితి వచ్చిందని, ఇప్పటికైనా బీఆర్ఎస్ నిర్మాణంపై నాయకత్వం దృష్టి సారించాల్సిన అవసరం ఉందని సూచించారు. గుత్తా సుఖేందర్ రెడ్డి వ్యాఖ్యలపై మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి వ్యంగ్యాస్త్రాలు సంధించారు. గుత్తా సుఖేందర్ రెడ్డి రాజకీయ ఆరంభం రోజున తాను పుట్టనే లేదన్నారు. సుఖేందర్ రెడ్డి చాలా సీనియర్ నాయకుడని, పార్టీ నిర్మాణం గురించి ఆయన సలహాలు తీసుకుంటామన్నారు. ఏ పార్టీ ఎలా ఉంటుందని, వాటి నిర్మాణాల గురించి గుత్తాకు బాగా తెలుసని జగదీశ్‌రెడ్డి విమర్శించారు. గుత్తా వ్యాఖ్యల్లో రాజకీయ ప్రాధాన్యత లేదని, లోక్సభ ఎన్నికల తర్వాత ఆయన మాట్లాడిన ప్రతి విషయంపై చర్చిస్తామన్నారు. ఎంపీ అభ్యర్థి నిర్ణయం, పోటీ గురించి ఇప్పుడు మాట్లాడనని, దానిపై స్పష్టత రావాల్సి ఉందన్నారు.

# అకాల వర్షాలు, వడగళ్ల వానలతో పంట నష్టం

**మొదటిపేజీ తరువాయి**

సేకరించాలని వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులను ఆదేశించారు. అంతేకాకుండా వరి పంట కోతలు ఊపందుకున్న నేపథ్యంలో వచ్చే రెండు, మూడు వారాల పాటు అన్నదాతలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఇలాంటి అకాల వర్షాలు సంభవించే సందర్భంలో పంట నష్టం తగ్గించే విధంగా ముందుగా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో కర్షకులకు సూచించాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు.జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో సంబంధిత జిల్లా స్థాయి అధికారులు సమన్వయం చేసుకుంటూ వ్యవసాయ మార్కెట్ యార్డులు, ఐకేపీ కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యం బస్తాలు, ఇతర పంటలు తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి తుమ్మల ఆదేశించారు. ఇందుకోసం రైతుల సౌకర్యార్థం ఇప్పటికే 2 లక్షలకు పైగా టార్పాలిన్ కవర్లను అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు.

# రేవంత్.. రుణమాఫీ చేయకపోతే సీఎం పదవికి రిజైన్ చేస్తారా?

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

సీఎం రేవంత్ రెడ్డికి బీజేపీ నేత డీకే అరుణ సవాలు విసిరారు. మిస్టర్ రేవంత్ రెడ్డి.. ఓటుకు నోటు కేసులో అడ్డంగా దొరికిన దొంగవు నువ్వు.. నా బాగోతం చెబుతానంటావా? నీ చరిత్ర ఏంటో ప్రజల ముందు బయటపెడతా అని మండిపడ్డారు. దమ్ముంటే పాలమూరులోని తెలంగాణ చౌరస్తాకు రా అని సవాలు విసిరారు. నా నీతి, జాతి, డీకే సత్యారెడ్డి, చిట్టెం నర్సిరెడ్డి గురించి మాట్లాడే నైతిక హక్కు నీకు లేదని సీఎం రేవంత్ రెడ్డిపై మండిపడ్డారు. ఒక మహిళ అని చూడకుండా నోటికొచ్చినట్లు దొరసాని.. తొక్కుతా.. అంటూ చేసిన అహంకార మాటలు మానుకోవాలని హెచ్చరించారు. నీ తల్లి, చెల్లి, నీ కూతుర్ని అడుగు మహిళ అంటే ఏమిటో చెబుతారని అన్నారు. ఈ ప్రాంత బిడ్డగా ప్రజల మన్ననలు పొందుతుంటే చూసి ఓర్వలేక నోటికొచ్చినట్లు మాట్లాడితే సహించేది లేదని హెచ్చరించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి ఓటమి భయం పట్టుకుందని అన్నారు. ఎన్నికల కోడ్ వచ్చాక సీఎం రేవంత్‌రెడ్డి పాలమూరు జిల్లాలోనే ఐదుసార్లు పర్యటించారని తెలిపారు. ఆగస్టులోగా రైతులకు రుణమాఫీ చేయకుంటే సీఎం పదవికి రాజీనామా చేస్తావా..? అని ప్రశ్నించారు.

# నేడు వివాహ ప్రాప్తి కార్యక్రమం లేదు

- ట్రాఫిక్ ఇబ్బందుల దృష్ట్యా రద్దు చేశాం
- భక్తులెవరూ రావొద్దు
- ఆదివారం సాయంత్రం యథావిధిగా కల్యాణోత్సవం
- చిలుకూరి బాలాజా టెంపుల్ ప్రధాన అర్చకుడు రంగరాజన్
- గరుడ ప్రసాదం కోసం పోటెత్తిన భక్తులు
- అందుకే వెనక్కి తగ్గిన రంగరాజన్

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**



హైదరాబాద్ నగర శివారులోని చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకులు రంగరాజన్ కీలక ప్రకటన చేశారు. ఆలయం ప్రాంగణంలో ఆదివారం జరగాల్సిన 'వివాహ ప్రాప్తి' రద్దు చేస్తున్నట్లు చెప్పారు. శుక్రవారం గరుడ ప్రసాదంలో తలెత్తిన ఇబ్బందుల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. వివాహం కోసం ఎదురు చూస్తున్న వారు తమ ఇళ్లలోనే దేవున్ని ప్రార్థించుకోవాలని సూచించారు. అయితే, ఆదివారం సాయంత్రం జరిగే కల్యాణోత్సవం యథాతథంగా జరుగుతుందని స్పష్టం చేశారు. కాగా, సంతానం లేని వారి కోసం గరుడ ప్రసాదం పంపిణీ చేస్తారనే ప్రచారం నేపథ్యంలో శుక్రవారం బాలాజీ ఆలయానికి వెళ్లే దారులన్నీ భక్తులతో నిండిపోయాయి. ఒక్కసారిగా అధిక సంఖ్యలో కార్లు, వాహనాల్లో తరలిరావడంతో కిలో మీటర్ల మేర ట్రాఫిక్ జాం నెలకొంది. మాసబ్ ట్యాంక్ నుంచి మెహదీపట్నం, నానల్ నగర్, లంగర్ హౌస్, సన్ సిటీ, అప్పా జంక్షన్ మీదుగా చిలుకూరు ఆలయం వరకూ ట్రాఫిక్ స్తంభించిపోయింది. గరుడ ప్రసాదం కోసం దాదాపు 1.50 లక్షల మందికి పైగా వచ్చినట్లు పోలీసులు అంచనా వేశారు. అయితే, ప్రసాదం కేవలం 10 వేల మందికే సరిపోయేంత మాత్రమే ఉండగా ఉదయం 10 గంటలకే 70 వేల మందికి పైగా భక్తులు లైన్లో నిల్చున్నారు. దీంతో మళ్లీ చేయించి మధ్యాహ్నం 12 గంటల వరకూ సుమారు 35 వేల మందికి గరుడ ప్రసాదాన్ని పంపిణీ చేశారు.

### అసలేంటీ గరుడ ప్రసాదం.?

చిలుకూరు బాలాజీ ఆలయంలో కలియుగ ప్రత్యక్ష దైవం వెంకటేశ్వరుడు కొలువై ఉన్నాడు. ఈ ఆలయంలో 108 ప్రదక్షిణలు చేస్తే కోరిన కోర్కెలు తీరుతాయని భక్తుల విశ్వాసం. ప్రతి ఏటా శ్రీరామనవమి తర్వాత దశమి రోజు నుంచి ఆలయంలో బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. తొలి రోజు వేద పండితులు పుట్టమన్నుతో హోమ గుండాలు ఏర్పాటు చేసి బ్రహ్మోత్సవాలు ప్రారంభించారు. శుక్రవారం ధ్వజారోహణం, శేషవాహన సేవలు నిర్వహించనున్నారు. శుక్రవారం గరుత్మంతునికి నైవేద్యం సమర్పించారు. అనంతరం సంతానం లేని మహిళలకు గరుడ ప్రసాదం పంచనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకుడు రంగరాజన్ ఇటీవల ప్రకటించారు. ఇది సోషల్ మీడియాలో వైరల్ గా మారడంతో ఒక్కసారిగా ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఈ ప్రసాదం తింటే సంతానం లేని సంతాన భాగ్యం కలుగుతుందనేది భక్తుల విశ్వాసం. అయితే, ఒక్కసారిగా ఊహించిన దాని కంటే ఎక్కువగా భక్తులు రావడంతో ప్రసాదం పంపిణీ నిలిపేశారు. గతంలో అయితే తొలిరోజు తరువాత రెండో, మూడో రోజు సైతం గరుడ ప్రసాదం వితరణ ఉండేదన్నారు. కానీ ఈ ఏడాది తొలిరోజుతోనే గరుడ ప్రసాదం పంపిణీ నిలిపివేసినట్లు రంగరాజన్ స్పష్టం చేశారు. గరుడ ప్రసాదం కోసం భక్తులెవరూ చిలుకూరు బాలాజీ ఆలయానికి వచ్చి ఇబ్బంది పడకూడదని చెప్పారు.

### వైభవంగా బ్రహ్మోత్సవాలు

మరోవైపు, చిలుకూరు బాలాజీ ఆలయంలో ఈ నెల 21న సూర్యప్రభ వాహనం, గరుడ వాహనం సేవలు.. అదే రోజు రాత్రి 10:30 గంటలకు స్వామి వారి కల్యాణోత్సవం నిర్వహిస్తారు. ఈ నెల 22న వసంతోత్సవం, గజవాహన సేవలు, 23న పల్లకి సేవ, అర్ధరాత్రి 12 గంటలకు స్వామి వారి రథోత్సవం ఊరేగింపు ఉంటుంది. 24న మహాభిషేకం, ఆస్థాన సేవ, అశ్వవాహన సేవ, పుష్పాంజలి సేవలు నిర్వహిస్తారు. ఈ నెల 25న చివరి రోజు ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని ఆలయ నిర్వాహకులు తెలిపారు.




# ఇష్టపడి చదివితే లక్ష్యాలు సాధిస్తారు

**గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమంలో మాజీ ఐఏఎస్**

**చిట్యాల,విశాలభారతి:** విద్యార్థులు ఇష్టపడి చదివితేనే లక్ష్యాలను సాధిస్తారని మాజీ ఐఏఎస్, సి ఎస్ సి అకాడమీ నిర్వాహకురాలు మల్లవరపు బాలలత అన్నారు. చిట్యాల పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్లో జరిగిన పేరెంట్ ఓరియంటేషన్ గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలకు చిన్నప్పటి నుండే ఇష్టంగా చదివే అలవాటును తల్లిదండ్రులు నేర్పాలని అన్నారు. ఉన్నత లక్ష్యాలకి చేరే విధంగా పిల్లలను మానసికంగా దృఢంగా తయారు చేయాలని సూచించారు. ఉపాధ్యాయులు విద్యతోపాటు విద్యార్థులకు సమాజంలో మెలగాల్సిన స్థితిగతులపై విద్యార్థులను దృఢంగా తయారు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్.సి.టి ఈ ఎస్ ఆర్ సి ఎడ్యుకేషనల్ డిపార్ట్మెంట్ ఉస్మానియా యూనివర్సిటీ వైస్ డా.శంకర్, ప్రిన్సిపాల్ బొడ్డు యాదగిరి గౌడ్, డైరెక్టర్స్ కన్నబోయిన శ్రీధర్, నగేష్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లపల్లి నాగేశ్వర రావుకు డాక్టరేట్ ప్రధానం



**సికింద్రాబాద్ ,విశాలభారతి:** ఓయూ ఇంజనీరింగ్ కళాశాల, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్(ఇన్ఫర్మాటిక్స్) విభాగంలో డాక్టర్.వి.బి.నరసింహా పర్యవేక్షణలో " ఇంప్లిమెంటేషన్ ఆఫ్ డీప్ లేర్నిగ్ అండ్ కంప్రెషన్ టెక్నిక్స్ ఆన్ హెల్త్ కేర్ సిస్టం ఫర్ ఇంప్రూవ్డ్ డేటా స్టోరేజ్ ఎఫీసైన్సీ " అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని పూర్తి చేసి నందుకు గాను జిల్లపల్లి. నాగేశ్వర రావు కు ఓయు పీహెచ్డీ డాక్టరేట్ ప్రధానం చేసినట్లు ఓయు పరీక్షల విభాగం ఒక ప్రకటన లో పేర్కొన్నారు. తనకు జన్మనిచ్చిన తల్లితండ్రులకు, విద్యాబుద్ధులు నేర్పిన అధ్యాపకులకు రుణపడి ఉంటానని. తన తండ్రిగారైన దివంగత జిల్లపల్లి.ప్రసాద్ తన డాక్టరేట్ అంకితం చేస్తున్నట్లు చెప్పారు.ఈ సందర్భంగా ప్రొ.సుధ, ప్రొ.శ్యామల, ప్రొ.వెంకట్ దాస్, ప్రొ.సురేష్ కుమార్, ప్రొ.సుజాత, ప్రొ.హమీద్ లకు కృతజ్ఞతలు తెలియచేశారు. పలువురు అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు మరియు కుటుంబసభ్యులు జె.నాగేశ్వర రావు ను అభినందించారు.





# సుపరిపాలనకు, విజన్‌కు కేరాఫ్ చంద్రబాబు నాయుడు

**ఓయూలో ఘనంగా బాబు 74వ, పుట్టినరోజు వేడుకలు**
**కేక్ కట్ చేసి మొక్కలు నాటిన అభిమానులు**

**సికింద్రాబాద్,విశాలభారతి** మాజీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, నవ్యాంధ్రప్రదేశ్ తొలి సీఎం టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు 74వ, పుట్టినరోజు వేడుకలు శనివారం చంద్రబాబు నాయుడు ఫ్యాన్స్ అసోసియేషన్ , స్కూల్ ఆఫ్ సీబీఎన్ అధ్యక్షుడు ,ఓయూ పరిశోధన విద్యార్థి తలారి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి , ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు.అనంతరం శ్రీనివాసరావు మాట్లాడుతూ సుపరిపాలన కు ,విజన్ కు కేరాఫ్ చంద్రబాబు నాయుడు అన్నారు. ఇక ఆరోగ్య పరంగా కూడా 74 ఏళ్లకు సంపూర్ణ తో నేటికి ఫిట్నెస్ తో ఉండటం అయినకె సాధ్యం అన్నారు.నేటి యువ నేతలకు భావి పాలకులు అయిన ఒక ఉదాహరణ మార్గదర్శి అన్నారు. టెక్నాలజీని ఒడిసి పట్టుకొని ఇటు యూత్ కు ఉపాధి అవకాశాలు ఇస్తు ఆర్థికంగా రాష్ట్రని ఆర్థికంగా బలోపేతం చేసిన నేత అన్నారు. పార్టీని బలోపేతం చేసేందుకు ఆయన కృషి చొరవతో నేడు పార్టీ ప్రతిష్టాత్మకంగా ఉందన్నారు. ఎన్టీఆర్ ,అంబేద్కర్ ఆలోచన విధానాన్ని అమలు చేస్తు నాడు జన్మభూమి తో ప్రజలతో మమేకం అవుతూ ప్రజల వద్దకే పాలన అంటు ప్రజా సంక్షేమం కోసం పాటుపడిన నేత అన్నారు. రానున్న ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ప్రజలు ఇంత సుదీర్ఘ అనుభవం, బాధ్యత గా భరోసా ను ఇస్తున్న చంద్రబాబు నాయుడుకు అండగా ఉంటు ఆశీర్వదించాలని కోరారు.ఈ కార్యక్రమంలో చంద్రబాబు నాయుడు ఫ్యాన్స్ అసిసోయేషన్ ,స్కూల్ ఆఫ్ సీబీఎన్ అభిమానులు ,నేతలు సతీష్ గౌడ్, సాయి రామ్, సి యచ్.గోపీ ,వెంకట్ స్వామి , బి.గోపీ , నరేష్ , రాము, రాకేష్, బ్రహ్మం ,రాజు , ఫ్యాన్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

# పార్టీ మారడం లేదు

**మొదటిపేజీ తరువాయి**

మార్పుపై స్పష్టత ఇచ్చారు. అయితే, పార్టీ మారితే ప్రజల నుంచి వ్యతిరేకత వస్తుందని పలువురు నేతలు, కార్యకర్తలు ఆయనకు సూచించినట్లు తెలుస్తోంది. వారి అభిప్రాయం మేరకు కాంగ్రెస్ లో చేరే నిర్ణయాన్ని ఆయన విరమించుకున్నారు. కాగా, ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ శుక్రవారం సీఎం రేవంత్ రెడ్డితో భేటీ అయ్యారు. నియోజకవర్గానికి సంబంధించిన సమస్యల గురించి చర్చించినట్లు చెప్పారు. ఈ క్రమంలోనే పార్టీ మార్పుపై ప్రచారం సాగింది. అయితే, తన కేడర్ తో సమావేశమైన అనంతరం ప్రకాష్ గౌడ్.. దీనిపై పూర్తి స్పష్టత ఇచ్చారు.

### 'ఆ ఉద్దేశం లేదు'

కేడర్ కు ఇష్టం లేని పని తాను ఎప్పటికీ చేయనని.. బీఆర్ఎస్ పార్టీని వీడేది లేదని ప్రకాశ్ గౌడ్ స్పష్టం చేశారు. 'బీఆర్ఎస్ లోనే ఉంటూ రాజేంద్రనగర్ నియోజకవర్గం ప్రజలకు సేవ చేస్తా. ఇక్కడి ప్రజలు ఆందోళన చెందొద్దు. ఎలాంటి సమస్య వచ్చినా నా దృష్టికి తీసుకురండి. అందరికీ న్యాయం చేస్తాను.' అని పేర్కొన్నారు.

# రాహుల్‌కి వయనాడ్‌లోనూ కష్టమే

**మొదటిపేజీ తరువాయి**

ముగిసిన తర్వాత మరో సురక్షిత స్థానాన్ని ఎంచుకునే అవకాశం ఉందని జోస్యం చెప్పారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా మహారాష్ట్రలోని నాందేడ్‌లో జరిగిన బహిరంగసభలో పాల్గొన్న ప్రధాని మోదీ, కాంగ్రెస్‌తోపాటు ఇండియా కూటమిలోని ఇతర పార్టీల నేతలపై వ్యంగ్యాస్త్రాలు సంధించారు.కాంగ్రెస్ యువరాజుకు వయనాడ్‌లోనూ కష్టకాలం కనిపిస్తోంది. యువరాజు, ఆయన బృందం ఈనెల 26న వయనాడ్‌లో జరిగే ఓటింగ్ కోసం ఎదురుచూస్తున్నారు. వయనాడ్‌లో పోలింగ్ పూర్తయ్యాక ఈ యువరాజు కోసం సురక్షిత స్థానం కోసం ప్రయత్నించవచ్చు. లేదా మరోచోట నుంచి పోటీ చేయించవచ్చు. ఇండియా కూటమిలోని నేతలు ఒకరినొకరు దూషించుకుంటున్నారు. యువరాజును కూటమిలోని సహచర పార్టీ నేత, కేరళ ముఖ్యమంత్రి విమర్శించారు. నేను కూడా అలాంటి భాష ఉపయోగించను. కానీ ఆయన అలాంటి భాష వాడారు. ఇదీ వారి పరిస్థితి. అమేఠీ నుంచి ఏ విధంగానైతే పారిపోయాడో అదేవిధంగా వయనాడ్‌ను వదులుకోకతప్పదు' అని రాహుల్ గాంధీని ఉద్దేశించి ఈ వ్యాఖ్యలు చేశారు. లోక్సభ ఎన్నికల్లో తొలి విడతలో భారత కూటమిని ప్రజలు పూర్తిగా తిరస్కరించారని ప్రధాని మోదీ విమర్శించారు.' తమ కుటుంబాల ప్రయోజన కోసం ఇండియా కూటమిలోకి వచ్చిన అవినీతి నాయకులను ప్రజలు చూశారు. అందుకే మొదటి దశలోనే ఓటర్లు ఇండియా కూటమిని పూర్తిగా తిరస్కరించారని వార్తలు వచ్చాయి. ఎన్నికల ప్రకటనకు ముందే కాంగ్రెస్ నేతల ఓటమిని అంగీకరించారన్నది వాస్తవం. అందుకే లోక్సభ స్థానాలకు పోటీ చేసి గెలుపొందిన కొందరు నేతలు ఈ సారి రాజ్యసభ ఎన్నికల్లో బరిలోకి దిగడానికి కారణమిదే. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు 370 ఆర్టికల్ సాకుతో కాంగ్రెస్ కశ్మీర్లో రాజ్యాంగాన్ని అమలు చేయనివ్వలేదు. మరోవైపు మహారాష్ట్ర అభివృద్ధి పట్టించుకోలేదు. ఇప్పుడు కేంద్రం అమలు చేస్తున్న పథకాల వల్ల రాష్ట్ర ప్రజలు లబ్ధి పొందుతున్నారు.




# కమర్షియల్ స్పేస్ హాట్ గురూ!

- ఐటీ కేంద్రంగా కో వర్కింగ్ అండ్ కో లివింగ్ స్పేస్
- కమర్షియల్ ఏరియాల నోటిఫైతో పెరిగిన వాణిజ్య లావాదేవీలు
- బెంగుళూరు, హైదరాబాద్ నగరాల్లోని కమర్షియల్ స్పేస్‌కు డిమాండ్

**విశాలభారతి, హైదరాబాద్ :**

హైదరాబాద్ కేంద్రంగా రియల్ భూమ్ కొత్త పుంతలు తొక్కుతుంది. విస్తరిస్తున్న ఐటీ సేవలు, పెరుగుతున్న కమర్షియల్ యాక్టివిటీతో ఐటీ కేంద్రంగా రియల్ వ్యాపారం ఆఫీస్ స్పేస్, రిటైల్ రంగాలతో దూసుకుపోతుంది. రెసిడెన్షియల్ సెగ్మెంట్‌లో ర్యాలీ కొనసాగుతుండగా, ప్రస్తుతం ఎన్నికల సందర్భంగా కొంత మందగించింది, కానీ కమర్షియల్ స్పేస్‌లో వ్యాపారం కొనసాగుతూనే ఉంది. గృహ కొనుగోలుదారులు వెయిట్ అండ్ సీ అన్నతీరుగా ఆలోచన ధోరణిలో ఉండటంతో కొత్త ప్రాజెక్టుల రాకపోయినా ఇన్వెంటరీ క్లియరెన్స్ జోరుగా నడుస్తోంది. రియల్ మార్కెట్‌పై ప్రముఖ రియల్ రంగ సంస్థలు తాజా నివేదికలు విడుదల చేశాయి. సిటీలో కో వర్కింగ్ అండ్ కో లివింగ్ తరహా రియల్ వ్యాపారానికి భారీ డిమాండ్ ఉందని వెల్లడైంది. ఇక కమర్షియల్ స్పేస్ విషయంలో దేశవ్యాప్తంగా బెంగుళూరు, హైదరాబాద్ నగరాలే ముందుంజలో ఉన్నట్లుగా తేలింది.

గ్లోబల్ సిటీ వైపు శరవేగంగా దూసుకుపోతున్న హైదరాబాద్ నగరంలో ఐటీ విస్తరణ, పెరుగుతున్న కమర్షియల్ యాక్టివిటీతో రియల్ ఎస్టేట్ ఆఫీసు సెగ్మెంట్ లోని కమర్షియల్ స్పేస్ వైపు శరవేగంగా విస్తరిస్తుంది. దీనికితోడు సిటీలోని 150 ప్రాంతాలను కమర్షియల్ జోన్లుగా ప్రకటించడంతో, ఆయా ప్రాంతాల్లో మరింత షాపింగ్ మాల్స్, కార్యాలయాలు, ఐటీ కంపెనీలు అందుబాటులోకి వస్తున్నాయి. గ్రేటర్ పరిధిలోని శివారు ప్రాంతాల వరకు కమర్షియల్ కళను సంతరించుకుందనీ, దీంతో కమర్షియల్ రెసిడెన్షియల్, రెంటల్ లీజింగ్ కంటే కో వర్కింగ్, కో లివింగ్ విధానంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం జరుగుతుందని పలు అధ్యయనాలు చెబుతున్నాయి. ప్రముఖ నిర్మాణ రంగ కన్సల్టెన్సీ సంస్థ నైట్ ఫ్రాంక్ కూడా ఇదే విషయాన్ని వెల్లడించింది. గత ఏడాది కాలంగా దేశవ్యాప్తంగా రియల్ వ్యాపారం తీరుతెన్నులపై ఆ సంస్థ నివేదిక ప్రకారం రెసిడెన్షియల్, లీజింగ్ ప్రక్రియ కంటే కో లివింగ్ అండ్ కో వర్కింగ్ వైపు కంపెనీలు మొగ్గుచూపుతున్నాయని, ఇందులో ఎక్కువగా ఐటీ కంపెనీలవే అగ్రభాగంగా ఉందనీ స్పష్టం చేసింది.

## 53% పెరిగిన హైదరాబాద్ లీజు...



ఇటీవల సంవత్సరాలలో, భారతదేశ కార్యాలయ రియల్ ఎస్టేట్ మార్కెట్ సానుకూలంగానే ఉంది. ప్రపంచ ఆఫ్‌షోరింగ్ పరిశ్రమలో వృద్ధి దిశలో సాగుతున్నది. హైదరాబాద్ ఆఫ్‌షోరింగ్ మార్కెట్ 2023లో 6.6 మిలియన్ చదరపు అడుగుల లీజు పరిమాణంలో ఉంది. ఇది దేశంలోని ఎనిమిది ఆఫ్‌షోరింగ్ మార్కెట్‌లలో 32 శాతంగా ఉంది. 2022లో 4.3 మిలియన్ చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న కార్యాలయ లావాదేవీలు 2023లో 53శాతానికి పైగా పెరిగాయి. నైట్ ఫ్రాంక్, ఆసియా పసిఫిక్ హారిజన్ నుండి వచ్చిన తాజా నివేదికలోనూ ఆఫ్‌షోరింగ్ ఉపయోగించుకోవడంలో భారతదేశం ప్రపంచంలోని ప్రముఖ ఆఫ్‌షోరింగ్ ప్రదేశాలలో ఒకటిగా ఉంది. భారతీయ మార్కెట్ 2023లో 46శాతానికి పైగా ఆఫీస్ స్పేస్‌ను లీజుకు ఇవ్వడంతో భారతదేశం యొక్క ఆఫీస్ స్పేస్‌లో గణనీయమైన అభివృద్ధి చెందింది. దేశవ్యాప్తంగా ఆఫ్‌షోరింగ్ మార్కెట్ 2023లో మొత్తం 27.3 మిలియన్ చ.అ. లీజింగ్ వాల్యూమ్‌ను చూసింది. ఇది మునుపటి సంవత్సరంతో పోలిస్తే 26శాతం గణనీయంగా పెరిగింది. ఇటీవలి సంవత్సరాలలో, దేశంలో ఆఫీస్ స్పేస్ రియల్ ఎస్టేట్ మార్కెట్ నుంచి సానుకూల ధోరణిని చూసింది. 2023లో దేశవ్యాప్తంగా 1,580 కంటే ఎక్కువ కేంద్రాలను పెంపొందించడం ద్వారా భారతదేశంలో గ్లోబల్ క్యాపబులిటీ సెంటర్ ల్యాండ్‌స్కేప్ గణనీయంగా అభివృద్ధి చెందింది. భారతీయ లీజింగ్ లావాదేవీలలో జీసీసీ యొక్క ప్రతిపాదన 2022లో 25% నుంచి 2023లో 35%కి పెరిగింది.



## ఐటీ కారిడార్ లో ఫుల్ డిమాండ్...

**ప్రధానంగా ఐటీ కారిడార్ విస్తరించిన గచ్చిబౌలి, హైటెక్ సిటీ, మియాపూర్,కొండాపూర్, జూబ్లీహిల్స్, బంజారా హిల్స్ తోపాటు ఫైనాన్షియల్ డిస్ట్రిక్ ఏరియాలోని కో లివింగ్ అండ్ కో వర్కింగ్ స్పేస్ వంటివి ఎక్కువగా అందుబాటులోకి వస్తున్నాయి. హైదరాబాద్‌కు వచ్చే కంపెనీలకు తగినట్లుగా ఆఫీస్ స్పేస్ మార్కెట్ లోకి వస్తోంది. దీంతో డిమాండ్ క్రమంగా పెరగడంతో కమర్షియల్ స్పేస్ క్రయవిక్రయాలు గత రెండు త్రైమాసికాల నుంచి రెండు రెట్లు పెరిగింది. అదేవిధంగా ప్రతి నెల దాదాపు 2.5లక్షల చ.అడుగులకుపైనే లీజు వ్యవహారాలు జరుగుతున్నాయి. మైండ్ స్పేస్ సమీపంలో బడా రియల్ ఎస్టేట్ సంస్థలు భారీ విస్తీర్ణంలో నిర్మాణం చేపడుతుండటంతో.. ఆఫీస్ స్పేస్ అందుబాటులోకి వస్తుందని చెబుతున్నారు. బడా టెక్ సంస్థలు కూడా హైటెక్ సిటీ పరిసరాల్లో భారీ స్థాయిలో లీజుకు తీసుకుంటున్నాయి. దీనితోపాటు రిటైల్ కమర్షియల్ సముదాయాలతో షాపింగ్ మాల్స్, మల్టీప్లెక్సుల ఏర్పాటు ఊపందుకుంది. ఇప్పటికే శివారు ప్రాంతాలలో మల్టీప్లెక్స్, కమర్షియల్ మాల్స్ ప్రధాన కేంద్రాలుగా మారుతున్నాయి. దానికి తగినట్లుగానే ఆయా సంస్థలు బ్రాండెడ్ షాపింగ్ మాల్‌స్‌ను నిర్మిస్తూ మార్కెట్‌లోకి తీసుకు వస్తున్నారు. ఈ క్రమంలో కమర్షియల్ ధరలు భారీ స్థాయిలో పెరగలేదని, గడిచిన ఏడాది కాలంగా పెద్దగా మార్పు లేదనీ నిపుణులు చెబుతున్నారు.**

## బెంగుళూరు కంటే హైదరాబాద్ బెటర్..

దేశవ్యాప్తంగా కమర్షియల్ స్పేస్ క్రయవిక్రయాల్లో బెంగుళూరు, హైదరాబాద్ నగరాలే ముందు ఉన్నప్పటికీ... భౌగోళిక, సహజ వనరులు, పుష్కళమైన ల్యాండ్ బ్యాంక్, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన ఎయిర్ వే, విదేశీ బడా కంపెనీల ప్రధాన కార్యాలయాలను కలిగిన ఉన్న హైదరాబాద్ బాగా కలిసి వస్తోంది. ఇక ఇటీవల కాలంలో బెంగుళూర్ నగరంలో ఎదురైతున్న నీటి ఎద్దడి, వరదలు వంటి సహజ విపత్తుల తోపాటు, అధిక జనాభాతో నిండి పోవడంతో తలెత్తే ఇతర పర్యావసానాలు అక్కడి మార్కెట్‌పై ప్రభావం చూపుతుంది. దీంతో బెంగుళూరులో మెరుగైన, ధృఢమైన ఐటీ నేపథ్యం ఉన్నప్పటికీ, భూముల లభ్యత తగ్గిపోవడంతో రియల్ ఎస్టేట్ కొంత డోలాయామానంలో పడింది. ఇక నిత్యం ఏర్పడే రాజకీయ సంక్షోభం వచ్చే గందరగోళమైన పరిస్థితులు అక్కడి మార్కెట్‌పై ప్రతికూల ప్రభావమే చూపుతున్నది. వీటన్నింటిని బేరీజు వేసుకుంటే అందుకు భిన్నమైన పరిస్థితులు హైదరాబాద్‌లో ఉన్నాయి. ఇక భూముల ధరల్లోనూ భారీ వ్యత్యాసాలు ఉండటంతో... అభివృద్ధికి ఆస్కారం ఉందని భావించి కొనుగోలు చేసేందుకు ప్రాధాన్యతనిస్తున్నారు.

## ధరలు ఇలా...

కమర్షియల్, రెసిడెన్షియల్ యాక్టివిటీ ఆధారంగా సిటీ వ్యాప్తంగా మార్కెట్ ధరలపై ఓ నివేదికను రూపొందించింది. ఇందులో ప్రధానంగా ప్రతి చ. అడుగుకు రెంటల్ ధరలు ఆఫీసు స్పేస్ లో రూ.60-80 ఉండగా, రిటైల్ ధరలు మాత్రం రూ. 140 నుంచి 160గా ఉంది. అదే గృహ సముదాయాల్లో మాత్రం ప్రతి చ.అడుగుకు రూ. 10-20 రేటు ఉంది. సిటీ వ్యాప్తంగా పెట్టుబడి కోసం చూస్తే రూ. 3500 నుంచి 6000 ఆఫీసు సముదాయాలకు ఉండగా, అదే రిటైల్ సంస్థలకైతే రూ. 10వేల నుంచి రూ. 15వేలుగా చదరపు అడుగుకు ఉంది. రెసిడెన్షియల్ వారీగా చూస్తే మాత్రం రూ. 4వేల నుంచి రూ. 10వేల వరకు ప్రతి చ. అడుగుకు పలుకుతుంది. అయితే సిటీలో రియల్ ధరలను ప్రభావితం చేయడంలో ప్రధానంగా కంపెనీల రాక, విస్తరిస్తున్న నగర శివారులతోపాటు, నగరంలోని ప్రధానమైన మార్గాలను కమర్షియల్ జోన్లుగా గుర్తించడం కూడా కారణాలు చెబుతున్నారు.

## కొత్త క్లస్టర్లతో ఫుల్ డిమాండ్...

శరవేగంగా నగర పరిధి విస్తరించడంతో హైదరాబాద్ కేంద్రంగా కమర్షియల్ స్పేస్‌కు డిమాండ్ వస్తున్నది. గతంలో కంటే వేగంగా ఓఆర్ఆర్ దాటి రియల్ ఎస్టేట్ క్రయవిక్రయాలు జరుగుతున్నాయి. ఇటీవల కాలంలో ప్రతిపాదిత రీజనల్ రింగు రోడ్డుకు భూముల కేటాయింపు, అలైన్‌మెంట్ పూర్తి కావడంతో మార్కెట్ కొత్త పుంతలు తొక్కుతుందంటున్నారు. రానున్న రోజుల్లో ఓఆర్ఆర్, రీజనల్ రింగు రోడ్డు మధ్య ఉండే కారిడార్ రియల్ ఎస్టేట్ రంగంలో జరిగే క్రయవిక్రయాలతో హైదరాబాద్ మరింత ఉన్నత స్థాయికి చేరనుంది. ఇప్పటికే అవుటర్ రింగు రోడ్డుకు ఇరువైపులా ఉన్న గ్రోత్ కారిడార్ రియల్ క్రయవిక్రయాలకు ప్రధాన కేంద్రంగా నిలుస్తోంది. ప్రభుత్వం కూడా నగరం చుట్టూరా పారిశ్రామిక క్లస్టర్లను ఏర్పాటు చేసే యోచనలో ఉండటం కూడా రియల్ ఎస్టేట్ మరింత కలిసి వచ్చే అవకాశం ఉందంటున్నారు.

# భట్టి నా కాళ్లు మొక్కిండు

- అసెంబ్లీ ఎన్నికల్లో రేవంత్ బాగా కష్టపడ్డాడు
- అందుకే రేవంత్ సీఎం అయ్యే చాన్స్ ఉందన్నాను
- అప్పటినుంచి భట్టి నా మీద పగబట్టిండు
- కాంగ్రెస్ సీనియర్ నేత వీహెచ్ హనుమంతరావు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**



మల్లు రవికి తాను టికెట్ ఇప్పిస్తే.. టెన్ జన్‌పథ్‌లో భట్టి విక్రమార్క తన కాళ్లు మొక్కిందు అని కాంగ్రెస్ సీనియర్ నేత వీ హనుమంతరావు సంచలన వ్యాఖ్యలు చేశారు. భట్టి విక్రమార్కను రాజకీయాల్లోకి తీసుకొచ్చిందే తాను.. ఇప్పుడు భట్టికి ఆ కృతజ్ఞత లేదన్నారు వీహెచ్. అసెంబ్లీ ఎన్నికల్లో రేవంత్ రెడ్డి బాగా కష్టపడ్డాడు. రాహుల్ గాంధీ ప్రోగ్రామ్ సక్సెస్ చేశాడు. బహిరంగ సభలను సక్సెస్ చేశాడు. అన్ని నియోజకవర్గాల్లో తిరిగాడు. కాబట్టి రేవంత్‌కు సీఎం అయ్యే ఛాన్స్ ఉన్నదని అన్నాను. ఆ మాట అన్నప్పట్నుంచి భట్టి నా మీద పగబట్టిండు. భట్టిని రాజకీయాల్లోకి తెచ్చిందే హనుమంత రావు. మీ అన్న మల్లు అనంత రామ్ చనిపోయినప్పుడు మల్లు రవికి టికెట్ ఇప్పిస్తే టెన్ జన్‌పథ్‌లో భట్టి నా కాళ్లు మొక్కాడు. ఇవాళ నాకు అన్యాయం చేస్తావా..? ఖమ్మం టికెట్ నాకు రాకుండా కుట్ర చేస్తున్నారని వీహెచ్ మండిపడ్డారు. భట్టి విక్రమార్కను తన తమ్ముడిలా భావించానని.. కానీ తన విషయంలో కుట్రలు చేస్తున్నారని కాంగ్రెస్ సీనియర్ నాయకులు వీ. హనుమంతరావు ఆరోపించారు. తనను రాజకీయాల్లోకి తీసుకొచ్చాననే కృతజ్ఞత కూడా లేదని మండిపడ్డారు. అంబర్‌పేటలోని తన నివాసంలో మధ్యాహ్నం 3 గంటల వరకు వీహెచ్ మౌనదీక్ష చేశారు. ఈ సందర్భంగా వీహెచ్ మాట్లాడుతూ.. బీజేపీకి అనుకూలంగా మాట్లాడినట్లు తనపై కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. తనను ఇబ్బంది పెట్టినవారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సోషల్‌మీడియాలో తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని.. దీనిపై సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశానని తెలిపారు. రాజకీయాల్లోకి తీసుకొచ్చానన్న కృతజ్ఞత భట్టి విక్రమార్కకు లేదని వీహెచ్ ఆరోపించారు. ఇప్పుడు తనకు ఖమ్మం ఇకెట్ రాకుండా కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. ఐదేండ్లుగా ఖమ్మం కోసం పనిచేస్తున్నా అని తెలిపారు. తనకు టికెట్ రాకుండా ఉండేందుకు బయటవారిని తీసుకొస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై రేవంత్ రెడ్డి స్పందించాలని కోరారు

# లీకులే తప్ప లాకప్‌లోకి పంపట్లేదు

- కేసీఆర్ దోచుకున్న సొమ్ము రికవరీ అయిందా?
- లక్ష కోట్లు కక్కించారా?
- మెదక్ జిల్లా మోదీ హయాంలోనే డెవలప్‌మెంట్
- మోడీని పెద్దన్న అంటూ రేవంత్ ప్రశంసలు
- ఎన్నికలప్పుడు విమర్శలా?
- మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్ రావు



**విశాలభారతి,స్టేట్ బ్యూరో :**

టీడీపీలో ఎదిగిన రేవంత్ రెడ్డికి ఆగస్టు నెల ఎందుకు గుర్తొస్తోందని, టీడీపీలో జరిగిన ఆగస్టు సంక్షోభం ఏమైనా గుర్తొస్తుందా అని మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్ రావు వ్యాఖ్యానించారు. రైతు రుణమాఫీకి ఆగస్టు నెలకు ఉన్న సంబంధం ఏంటని ఆయన ప్రశ్నించారు. నాంపల్లి బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. జూన్ 4 కే ఎన్నికల కోడ్ ముగుస్తోందని, జూన్ 10కి రైతు రుణమాఫీ చేయలేడా? అని మండిపడ్డారు. ఆగస్టు 15కు అయినా రేవంత్ రైతు రుణ మాఫీ చేస్తాడా? అని ఆయన అనుమానం వ్యక్తంచేశారు. మాఫీ చేయడం చేతకాకపోతే ప్రజలకు క్షమాపణలు చెబుతాడా అని ప్రశ్నించారు. రుణమాఫీ చేయకపోతే రాజ్ భవన్ కు వచ్చి రేవంత్ రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అది చేస్తాం.. ఇది చేస్తామని రోజూ లీకులు ఇవ్వడం తప్పితే తప్పు చేసిన ఎవరినీ లాకప్ లోకి పంపించట్లేరని రఘునందన్ రావు ఘాటు విమర్శలు చేశారు. రేవంత్ రెడ్డికి మెదక్ లో తప్పుడు స్క్రిప్ట్ రాసిచ్చారని, అబద్ధాలే మాట్లాడారని ఫైరయ్యారు. ఇక్రిశాట్ 1972 లో ఏర్పాటైందని, బీహెచ్ఈఎల్ 1964 నెహ్రూ కాలంలో ఏర్పాటు చేశారని, కానీ రేవంత్ ఇంద్రారా గాంధీ హయాంలో ఇక్రిశాట్, బీహెచ్ఈఎల్, బీడీఎల్, ఐడీపీఎల్ సంస్థలు వచ్చాయని చెబుతున్నారని ధ్వజమెత్తారు. దుబ్బాకలో ఏ రంగుతో పోటీ చేశానో, మెదక్ లో అదే రంగు తో పోటీ చేస్తున్నట్లుగా చెప్పారు. కొడంగల్ లో ఓడిన రేవంత్ రెడ్డి మల్కాజిగిరిలో గెలవలేదా? అని రఘునందన్ ప్రశ్నించారు. దుబ్బాకలో ఓడితే మెదక్ లో పోటీ చేయకూడదా అని ఫైరయ్యారు. తాను రేవంత్ కంటే రెండు ఆకులు ఎక్కువే చదువుకున్నానని ఆయన ఎద్దేవాచేశారు. కేసీఆర్.. దోచుకున్న సొమ్మును పేదలకు పంచుతామని చెప్పిన రేవంత్ ఆ సొమ్మును రికవరీ చేశారా? అని, లక్ష కోట్లు కక్కించారా? అని, వాటిని ఎంతమందికి పంచారో రేవంత్ రెడ్డి చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. కేసీఆర్ దోచుకున్న సొమ్ముతో ఆరు గ్యారెంటీలు అమలుచేస్తామన్నారని ఆయన వ్యాఖ్యానించారు. మోడీ పదేళ్ల అభివృద్ధిపై చర్చకు తాను రెడీ అని, దీనిపై రేవంత్ సిద్ధమా అని ప్రశ్నించారు. తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద అయినా, మెదక్, గజ్వేల్, సిద్ధిపేట్ రైల్వే స్టేషన్ వద్దఅయినా తాను చర్చకు సిద్ధమని, రేవంత్ రావాలని సవాల్ చేశారు. పొంగులేటి బంధువు కాబట్టే వెంకట్రామిరెడ్డిని అరెస్ట్ చేయడం లేదన్నారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావు దొంగ మాటలు చెప్పి దుబ్బాకలో తనను దొంగ దెబ్బ కొట్టారన్నారు. రేవంత్ రెడ్డి కూడా ఇప్పుడు అదే దారిలో నడుస్తున్నారనిరఘునందన్ ఫైరయ్యారు. మోడీని బడే భాయ్ అన్నది రేవంత్ రెడ్డేనని, ఇప్పుడు ఎన్నికలు రాగానే విమర్శలు చేస్తున్నారని రఘునందన్ ధ్వజమెత్తారు.

# కడియం బండారం బయటపెడతా

- సీఎం చరిత్ర అంతా నాకు తెలుసు
- వరంగల్‌లో బీఆర్ఎస్‌దే గెలుపు
- ఎర్రబెల్లి దయాకర్ రావు

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**



కడియం శ్రీహరిపై, సీఎం రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు కీలక వ్యాఖ్యలు చేశారు. కడియం శ్రీహరి పార్టీ విడిచి వెళ్లటంతో.. బీఆర్ఎస్‌కు పట్టుకున్న దరిద్రం వదిలిందని ఎర్రబెల్లి అభిప్రాయపడ్డారు. ఇదే క్రమంలోనే.. వారం రోజుల్లో కడియం శ్రీహరి బండారం మొత్తం బయటపెడతానని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి చరిత్ర అంతా తనకు తెలుసని.. ఆయన బండారం కూడా బయటపెడతానంటూ చెప్పుకొచ్చారు. వరంగల్ పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిదే గెలుపని.. తన సర్వేలు ఎప్పుడు తప్పు కాలేదని కీలక వ్యాఖ్యలు చేశారు. దేశంలో ఈసారి కాంగ్రెస్ పార్టీకి ప్రతిపక్ష హోదా కూడా దక్కదని ఎర్రబెల్లి దయాకర్ రావు జోస్యం చెప్పారు.

# 22,23న రాష్ట్రవ్యాప్తంగా వర్షం

- చల్లబడ్డ నగరం
- హైదరాబాద్ లో ఉరుములు మెరుపులతో వర్షం

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

ఉక్కబోతతో ఉక్కిరిబిక్కిరవుతున్న హైదరాబాద్ నగర వాసులకు కాస్త ఊరట లభించింది. నగరంలోని పలుచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిచింది.. రాజేంద్రనగర్, తుర్కయంజాల్, కొత్తపేట, సరూర్‌నగర్, నాగోల్, చైతన్యపురి, చంపాపేట, సైదాబాద్, శంషాబాద్, ఆదిబట్ల, చార్మినార్, నాంపల్లి, మలక్‌పేట్, దిల్‌సుఖ్‌నగర్, వనస్థలిపురం, హయత్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్, కాచిగూడ, ముషీరాబాద్, ఆర్టీసీ క్రాస్ రోడ్స్, అశోక్‌నగర్, బాగ్లింగంపల్లి, రాంనగర్, అడిక్‌మెట్, ఖైరతాబాద్, లక్టీకపూల్, తార్నాక, ఓయూ క్యాంపస్, హబ్సిగూడ, నాచారం, మల్లాపూర్, ఉప్పల్, నారాయణగూడ, హిమాయత్‌నగర్, లిబర్టీ, బషీర్‌బాగ్, లంగర్‌హౌస్, కార్వాన్, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, పంజాగుట్ట, మెహదీపట్నం, మాసబ్‌ట్యాంక్, మాదాపూర్, బడంగ్‌పేట, జల్‌పల్లిలో వర్షం కురుస్తున్నది. దీంతో నగరమంతా ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. ఆకాశం మేఘావృతమై ఉన్నది. శనివారం ఉదయం నుంచి చల్లని గాలులు వీస్తుండటంతో పొద్దున 7 గంటల నుంచే సూర్యుని సెగలతోపాటు వడగాల్పులతో సతమతమవుతున్న నగర ప్రజలు ఊపిరిపీల్చుకుంటున్నారు. కాగా, భానుడి భగభగలతో రాష్ట్రమంతా నిప్పుల కొలిమిని తలపిస్తున్నది. గరిష్ఠ ఉష్ణోగ్రతలు పెరిగాయి. వడగాలులు, ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. శుక్రవారం రాష్ట్రంలోనే అత్యధికంగా మంచిర్యాలలో 45.2 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. రాష్ట్రంలోని నగరాలు, పట్టణాల్లో మధ్యాహ్నం వేళ రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. కొన్ని ప్రాంతాల్లో కర్ఫ్యూ వాతావరణం కనిపించింది. రాష్ట్రంలో శుక్రవారం ఒక్కరోజే వడదెబ్బ సోకి ఐదుగురు వ్యక్తులు మృత్యువాత పడ్డారు. రాబోయే రోజుల్లో గరిష్ఠంగా 2 నుంచి 3 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉన్నదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.ఈ నెల 22, 23 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా అకడకడా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని వాతావరణ శాఖ తెలిపింది. ఎండల నేపథ్యంలో మధ్యాహ్నం 12 నుంచి 3 గంటల మధ్య బయటకు వెళ్లొద్దని వైద్య, ఆరోగ్య శాఖ సూచించింది. తప్పక వెళ్లేవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. పిల్లలు, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు, గర్భిణులు చాలా జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచించారు



అఖిలభారత సర్వీసు పరీక్ష -2023 లో జాతీయ స్థాయిలో మూడవ ర్యాంకు సాధించి తెలంగాణ ప్రతిష్ఠను జాతీయ స్థాయిలో చాటిన దోనూరి అనన్య ఆదివారం తన కుటుంబ సభ్యులతో సిఎం రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. అనన్యతో పాటు ఈ సారి సివిల్ సర్వీసెస్ కు ఎంపికైన తెలుగు అభ్యర్థులందరికీ సిఎం ప్రత్యేక అభినందనలు తెలిపారు. దేశ సేవలో వారంతా మంచి పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షిస్తున్నన్నారు.

# ప్రతీ టిన్ కోటి రూపాయలు

- నెయ్యి టిన్ అని కోడ్
- కేజ్రీవాల్, కవితల వాట్సాప్ చాట్ ఉంది
- కేంద్ర హోంమంత్రిత్వ శాఖకు లేఖ
- సుఖేష్ చంద్రశేఖర్



**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

మనీ లాండరింగ్ కేసులో అరెస్టై మండోలి జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న సుఖేశ్ చంద్రశేఖర్.. లిక్కర్ స్కాం కేసులో ఇప్పటికే కవిత, కేజ్రీవాల్ పాత్రలున్నట్టుగా పలు కీలక లేఖలు రాసిన విషయం తెలిసిందే. కాగా.. ఇప్పుడు కూడా మరోసారి కవితను టార్గెట్ చేస్తూ.. తన లాయర్ ద్వారా లేఖ విడుదల చేశాడు. ఢిల్లీ లిక్కర్ స్కాం కేసుపై సాగుతున్న విచారణలో అరవింద్ కేజ్రీవాల్, కవితపై జోక్యం చేసుకోవాలని కేంద్ర హోం మంత్రిత్వ శాఖకు సుఖేశ్ చంద్రశేఖర్ ఈ లేఖ రాశాడు. ఈ సందర్భంగా కవిత, సత్యేంద్ర జైన్, అరవింద్ కేజ్రీవాల్‌కు మధ్య జరిగిన వాట్సాప్ చాటింగ్‌లు ఇవేనంటూ లేఖకు జతచేశాడు.

కవిత వద్ద నుంచి సేకరించిన నగదును సత్యేందర్ జైన్, అరవింద్ కేజ్రీవాల్.. ఢిల్లీ, గోవాకు పంపించారని సుఖేష్ ఆరోపించాడు. తాను పేర్కొన్న చాటింగుల్లో డబ్బును "నెయ్యి టిన్" గా కోడ్ లాంగ్వేజ్ పెట్టుకున్నామని ప్రతి టిన్ కోటి రూపాయలకు సమానంగా ఉందని పేర్కొన్నాడు. ఈ వాట్సాప్ స్క్రీన్ షాట్లు ఈ కేసులో కవిత, సత్యేంద్ర జైన్, కేజ్రీవాల్ పూర్తి ఇన్వాల్‌వ్‌మెంట్‌ను నిర్ధారిస్తున్నాయన్నాడు. కవిత సూచనల మేరకే తన సిబ్బంది.. హైదరాబాద్‌లోని బీఆర్ఎస్ కార్యాలయం నుంచి నగదును సేకరించారని తెలిపారు. ఈ కేసులో కీలక పాత్ర పోషించిన పెద్దలకు సంబంధించిన వాట్సప్ చాటింగులు తన దగ్గర చాలా ఉన్నాయని.. అందులో కొన్నింటిని మాత్రమే ఈ లేఖలో పేర్కొన్నట్టుగా సుఖేష్ బాంబు పేల్చారు. కవిత ప్రస్తుతం కస్టడీలో ఉన్నందున సుఖేశ్ చంద్రశేఖర్ లేఖలో పేర్కొన్న స్క్రీన్‌షాట్‌లు దుమారం రేపుతున్నాయి.

# చేవెళ్లలో గులాబీ జెండా గెలుస్తుంది



## బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

చేవెళ్లలో గులాబీ జెండా ఎగరడం ఖాయమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కాసాని జ్ఞానేశ్వర్‌కు చేవెళ్లలో సానుకూల స్పందన ఉందని తెలిపారు. ముఖ్యంగా కేసీఆర్ బహిరంగ సభ తర్వాత కాసాని విజయం ఖాయమైందని అభిప్రాయపడ్డారు. హైదరాబాద్ నంది నగర్‌లోని కేసీఆర్ నివాసంలో కేటీఆర్ అధ్యక్షతన చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ సమీక్షా సమావేశం జరిగింది. పార్లమెంటు ఎన్నికల సందర్భంగా చేవెళ్లలో అనుసరించాల్సిన వ్యూహాలపై, ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా చేవెళ్ల గడ్డపైన మరోసారి గులాబీ జెండా ఎగురడం ఖాయమన్న విశ్వాసాన్ని పార్టీ నాయకులు వ్యక్తం చేశారు. పార్టీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ అభ్యర్థిత్వానికి చేవెళ్ల ప్రజల నుంచి సానుకూల స్పందన లభించడంతో పాటు అన్ని వర్గాల నుంచి పెద్ద ఎత్తున మద్దతు వస్తుందని తెలిపారు. 30 సంవత్సరాల పాటు బడుగు, బలహీన వర్గాలతో పాటు సమాజంలోని అన్ని వర్గాల కోసం పనిచేసిన కాసాని జ్ఞానేశ్వర్‌కు ఈ ఎన్నికల్లో గెలుపు తథ్యం అని కేటీఆర్ విశ్వాసం వ్యక్తం చేశారు. కాసాని జ్ఞానేశ్వర్ గ్రామీణ ప్రాంతం నుంచి అంచెలంచెలుగా ఎదిగారని.. సుదీర్ఘ అనుభవం గల రాజకీయ నాయకుడు అని కొనియాడారు. కాసాని రంగారెడ్డి జిల్లా స్థానికుడు అని, ఆయనకు ఇక్కడి ప్రజల కష్టసుఖాలు, అన్ని ప్రాంతాలపైన సంపూర్ణ అవగాహన ఉందని అన్నారు. కేసీఆర్ బహిరంగ సభ తర్వాత కాసాని విజయం ఖాయమైందని అన్నారు. ఈ దిశగా అన్ని ప్రాంతాల నుంచి అన్ని వర్గాల నుంచి అద్భుతమైన స్పందన లభిస్తుందని తెలిపారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నన్ని రోజులు అధికారాన్ని అనుభవించి, పార్టీకి, నాయకత్వానికి నమ్మకద్రోహం చేసి వెళ్లిన రంజిత్ రెడ్డితో పాటు మహేందర్ రెడ్డి వైఖరిని ప్రజలు అసహ్యించుకుంటున్నారని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ, కేసీఆర్ వీళ్లకు ఏం తక్కువ చేశారని ప్రశ్నిస్తున్నారని పేర్కొన్నారు. ఒక పార్టీ పట్ల నిబద్ధత లేని నాయకులను ప్రజలు నమ్మరని స్పష్టం చేశారు. అధికారం కోసం జెండాలు మార్చే వాళ్లను ప్రజలు తిరస్కరిస్తారని తెలిపారు.

# సీఎం రేవంత్ రెడ్డికి ఆగస్టు సంక్షోభం

- జూన్ లో ఓటుకు నోటు విచారణ
- 14 సీట్లు గెలవకుంటే రేవంత్ రెడ్డి రాజీనామా చేస్తాడా
- కాంగ్రెస్ 14 సీట్లు గెలిస్తే నేను రాజకీయాల నుంచి తప్ప కుంటా
- బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి

**విశాలభారతి, స్టేట్ బ్యూరో :**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కూడా ఆగస్టు సంక్షోభం ఎదురుకానుందని, జూన్ లో ఓటుకు నోటు విచారణ జరిగిందని, బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. గతంలో ఇలా టీడీపీకి జరిగిందని, రేవంత్ రెడ్డి కూడా యెల్లో కాలేజీకి చెందిన వ్యక్తేనని ఆయన పేర్కొన్నారు. నాంపల్లి బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో శనివారం మీడియాతో ఆయన మాట్లాడారు. రేవంత్ రెడ్డేం కరెంట్ తీగ కాదని, ఇతరులు మల్లె తీగలు కూడా కాదన్నారు. కావాలంటే తమను ముట్టుకుని చూడాలని, తాము ఎలాంటి వైర్లమో తెలుస్తుందని వార్నింగ్ ఇచ్చారు. మోడీని విమర్శించే స్థాయి రేవంత్ రెడ్డికి లేదని, పెద్ద వాళ్లను విమర్శించినంత మాత్రాన పెద్ద వాళ్లు అయిపోరని విమర్శించారు. ఆకాశంపై ఉమ్మి వేస్తే తిరిగి ముఖంపైనే పడుతుందనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. గతంలో చెప్పినట్లే తెలంగాణలో బీజేపీ అత్యధిక ఎంపీ స్థానాల్లో గెలువనుందని ధీమా వ్యక్తంచేశారు. 14 సీట్లు గెలవకుంటే రేవంత్ రెడ్డి రాజీనామా చేస్తారా? అని ఆయన ప్రశ్నించారు. అదే కాంగ్రెస్ 14 సీట్లు గెలిస్తే తాను రాజకీయాల నుంచి తప్పుకుంటానని సవాల్ విసిరారు. ఇచ్చిన హామీలు అమలు చేయకుండా రేవంత్ రెడ్డి.. ఎన్నికల ప్రచారానికి ఎలా వెళ్తున్నారో ఆలోచించుకోవాలన్నారు. అన్ని హామీలు అమలు చేశాకే ఎన్నికల్లో ప్రచారానికి వస్తామని చెప్పింది మరిచిపోయావా? అని ఏలేటి మహేశ్వర్ రెడ్డి ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి రాష్ట్రానికి ముఖ్యమంత్రి హోదాలో హుందాగా మాట్లాడటం లేదని ఆయన ధ్వజమెత్తారు. ఆయన స్టేట్ మెంట్లు చూస్తుంటే ఆందోళన, అభద్రతాభావంలో ఉన్నట్లు కనిపిస్తోందని ఏలేటి మహేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు.



# మైనార్టీలకు మంత్రి పదవి ఇవ్వరా..?

**విశాల భారతి, స్టేట్ బ్యూరో:**

రాష్ట్రంలో ముస్లింలు అనాథలు అయ్యారని, మైనార్టీలకు రేవంత్ రెడ్డి ఒక్క మంత్రి పదవి కూడా ఇవ్వలేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ మహమూద్ అలీ అన్నారు. మైనార్టీల కోసం కేసీఆర్ చాలా మంచి కార్యక్రమాలు చేశారన్న ఆయన, కాంగ్రెస్ పార్టీ తెలంగాణకు ఎప్పుడూ అన్యాయమే చేస్తుందని ఆరోపించారు. మైనార్టీలకు కూడా హస్తం అన్యాయం చేసిందని, లౌకికవాదం అని చెప్పుకుంటుంది కానీ, ఏమీ చేయదని అన్నారు.దేశంలో లౌకికవాదాన్ని పాటించేది ప్రాంతీయ పార్టీలు మాత్రమే అన్న మహమూద్ అలీ, లౌకికవాదాన్ని పూర్తి స్థాయిలో అమలు చేసింది కేసీఆర్ మాత్రమేనని పేర్కొన్నారు. కాంగ్రెస్ నేతల మాటలు విని మోసపోయామని పలువురు ముస్లింలు చెప్తున్నారని తెలిపారు.



# వీర హనుమాన్ శోభయాత్ర పోస్టర్ ఆవిష్కరణ

**సంగ్రహం మహారాజ్**

**నారాయణఖేడ్ విశాల భారతి** ఈనెల 23 మంగళ వారం సాయంత్రం నాలుగు గంటలకు జరిగే వీరా హనుమాన్ శోభయాత్ర పోస్టర్ ను కొండాపూర్ ఆశ్రమంలో సంగ్రాహం మహారాజ్ చేతుల మీదుగా ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భజరంగ్దళ్ నాయకులు ప్రవీణ్ గౌడ్, జగదీష్ అశోక్ యాదవ్ పాల్గొన్నారు.



# 12 మంది విద్యార్థులు గురుకులానికి ఎంపిక

**ధర్పల్లి విశాల భారతి** ధర్పల్లి మండల కేంద్రంలో గల సన్ శైన్ పాఠశాలలోని విద్యార్థినీ విద్యార్థులు ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా వారి ప్రతిభను చాటారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ ఇంజాపురం మహేందర్ మాట్లాడుతూ.. గురుకులనికి 14 విద్యార్థులు ప్రవేశ పరీక్షలు రాయగా.. 12 విద్యార్థులకు గురుకుల సీట్లు రావడం చాలా గర్వకారణంగా ఉందని అన్నారు. తమ బోధన సిబ్బంది బోధన విద్యార్థుల తల్లిదండ్రుల ప్రోత్సాహం వలన పిల్లలు గురుకులకు ఎంపిక అయ్యారని తెలిపారు. హెడ్ మినిస్టర్ శిరీష మాట్లాడుతూ గురుకులానికి ఎంపికైన విద్యార్థిని విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం 202425 సంవత్సరానికి అడ్మిషన్లు ప్రారంభమైనవి కావున తల్లిదండ్రులు పిల్లలు ప్రతిభావంతులు కావాలంటే సన్ శైన స్కూల్లో అడ్మిషన్ పొందాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో సన్ శైన కరస్పాండెంట్ ఇంజాపురం మహేందర్, మేనేజింగ్ డైరెక్టర్ సుమలత, హెడ్ మినిస్టర్ శిరీష, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.



# సొంత గూటికి మాజీ సర్పంచ్

**నారాయణఖేడ్, విశాల భారతి** నారాయణఖేడ్ నియోజకవర్గంఖేడ్ మాండలం శేరితండ గ్రామ పంచాయతీ కి చెందిన తాజా మాజీ సర్పంచ్ సంఖిభాయి నెహ్రూ నాయక్, గ్రామ పంచాయతీకి సంబంధించిన మాజీ ఉపసర్పంచ్ మోతిరం, 8 మంది వార్డ్ మెంబర్ , శెట్టి నాయక్, మారుతి నాయక్, బాన్సిరామ్, సుమారు 100 కుటుంబ సభ్యులు లకు ఉమ్మడి జిల్లా మాజీ ప్రణాలిక సంఘం సభ్యులు నగేశ్ షేట్కర్, పిసిసి సభ్యులు కే శ్రీనివాస్ కలిసి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి చేర్చుకోవడం జరిగింది.



# ఉపాధి హామీ పనిని వినియోగించు కోవాలి

**సైదాపూర్, విశాల భారతి:** మండల కేంద్రంలోని వెన్కేపల్లి, జాగిరిపల్లి గ్రామాలలో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద చెరువులలో పూడికతీత పనులను కమిషనర్ పంచాయతీరాజ్ కార్యాలయం హైదరాబాద్ నుండి వచ్చిన కరీంనగర్ జిల్లా ప్రత్యేక అధికారి అభయ్ కుమార్ పరిశీలించారు. పని ప్రదేశంలో కూలీలతో ప్రత్యక్షంగా మాట్లాడుతూ, మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం క్రింద చేపడుతున్న పనుల ద్వారా ఉపాధి హామీ కూలీలకు ఏ విధంగా చేయూతనిస్తోందో, పనులు జరుగుతున్న తీరును పరిశీలించి ఇట్టి ఉపాధి హామీ పనిని గ్రామస్థాయిలో అందరు వినియోగించు కోవాలని సూచనలు సలహాలు ఇచ్చారు. అనంతరం ఉపాధి హామీ కూలీలకు ఓఆర్ఎస్, గ్లూకోస్, పౌడర్ ప్యాకెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి వి శ్రీధర్ , అదనపు డి ఆర్ డి ఓ సంధ్యారాణి ,ఎంపీడీవో యాదగిరి, ఏపీవో రాణి,ఈసీ, టిఏలు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి కళ్యాణం

**ధర్పల్లి విశాల భారతి:** శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరవ వార్షికోత్సవం పురస్కరించుకొని ధర్పల్లి మండలం దమన్నపేట్ గ్రామంలో ఘనంగా కళ్యాణ మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ మాట్లాడుతూ.. విశ్వ బ్రాహ్మణ కులం తరపున పట్టు వస్త్రాలు,ముత్యాల తలంబ్రాలు స్వామి వారికి సమర్పించారు. ఆలయ అర్చకులు, భక్తులతో కలిసి అంగరంగ వైభవంగా కనుల పండుగగా శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి కళ్యాణం, యజ్ఞ హోమాలతో, వేదమంత్రాలతో ఘనంగా నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మండలంలో గల అన్ని గ్రామాల భక్తులు పాల్గొని దేవుని కృపకు పాత్రులు అయ్యారు.

## విచ్చలవిడిగా స్పా సెంటర్లు

# స్పా సెంటర్లలో అసలు ఏం జరుగుతుంది?

**ఎల్బీనగర్ విశాలభారతి :** ఎల్బినగర్ నియోజకవర్గం లో సెలూన్ స్పా సెంటర్ లు ఇష్టానుసారంగా, విచ్చలవిడిగా నడుస్తున్నాయి. గల్లీకో స్పా సెంటర్ వెలుస్తున్నాయి. కొన్ని స్పా సెంటర్ లు ఎప్పుడు నిండుదనంతో దర్శనమిస్తున్నాయి. మరికొన్ని వెలవెల బోతున్నాయి. కారణం ఫుల్ సర్వీస్ చేయడం. దీనితో వారు ఆడిందే ఆట పాడిందే పాటగా మారింది.



**తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో**

ఎల్బినగర్ పరిధిలో గతంలో సుమారు ఐదు వరకు సెంటర్ లు ఉండేవని కాని నేడు సుమారు 15 పైన ఉన్నట్లు తెలిసింది. మాదాపూర్, గచ్చిబౌలి ప్రాంతాలలో దాడులు విస్తృతంగా జరిగి కేసులు నమోదవుతుండడంతో ఆంధ్రా ప్రాంతానికి చెందిన వ్యక్తులు ఎల్బినగర్ ను సేఫ్ జోన్ గా ఎంచుకుని విరివిగా బ్రాంచీలు ఏర్పాటు చేసుకుంటున్నట్లు చర్చ నడుస్తుంది. స్పా సెంటర్ల నిర్వాహకులు తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో సెంటర్ లు నడుపుతూ స్పా సెంటర్ బోర్డులు ఏర్పాటు లేకుండానే గుట్టు చప్పుడు కాకుండా నడుస్తుండడం గమనార్హం. వీటిపై జిహెచ్ఎంసి అధికారులు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

**అసలు రహస్యం ఏమిటి..**

స్పా సెంటర్ లు ఏర్పాటు చేసుకోవాలంటే హైకోర్టు నుండి పర్మినెంట్ లైసెన్స్ పర్మిషన్ తీసుకోవాలి. ఏ ఏరియా పేరుమీద తీసుకుంటే అక్కడే ఏర్పాటు చేసుకోవాలి. దీనితో పాటు లేబర్ లైసెన్స్, జిహెచ్ఎంసి నుండి ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలి. లేబర్, ట్రేడ్ లైసెన్స్ లు ప్రతి ఏటా రెన్యూవల్ చేసుకోవాలి. కాని లేబర్, ట్రేడ్ లైసెన్స్ లు రెన్యూవల్ లేకుండా నడుస్తున్నట్లు అనుమానాలు ఉన్నాయి. అందులో పనిచేసే థెరపిస్టులు ప్రతి ఒక్కరు సర్టిఫికెట్ కలిగి ఉండాలి. చాలా సెంటర్ లలో సర్టిఫికెట్ లు లేకుండానే సర్వీస్ చేస్తున్నట్లు తెలిసింది. నిర్వాహకులు లాభార్జనే ధ్యేయంగా ఏవి పట్టింపు లేకుండా కాలం వెళ్లదిస్తున్నారు.

**తూతు మంత్రాంగ దాడులు..**

గత ఫిబ్రవరి నెలలో న్యూ నాగోల్, నాగోల్ లోని స్పా కేంద్రాలపై దాడులు చేసినట్లు తెలిసింది. రెండు నెలల క్రితం ఏర్పాటైన ఒక కేంద్రం బోర్డు లేకుండానే ఫుల్ సర్వీస్ చేస్తున్నట్లు గమనించి సీజ్ చేసినట్లు తెలిసింది. మరో కేంద్రంపై పిట్టి కేసు నమోదు చేసినట్లు తెలిసింది. దాడులు జరిగినా మీడియా కు సమాచారం ఇవ్వడం లేదు. న్యూ నాగోల్ ప్రధాన రహదారిపై ఏర్పాటు చేసిన ఒక సెలూన్ స్పా సెంటర్ పై ఫుల్ సర్వీస్ చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఈ విషయం కాలనీ వాసుల దృష్టికి వచ్చింది. దీనికి సంబందించిన నిర్వాహకులే ఎల్బినగర్ మెట్రో స్టేషన్ సమీపంలో బ్రాంచి ఏర్పాటు చేసి భవనానికి బోర్డు లేకుండానే నిబంధనలు తుంగలో తొక్కి తమ ఇష్టానుసారంగా వ్యవహారిస్తున్నారు.

**కొత్తవారికి సర్వీస్ లేదు..**

కొత్తపేట లో ప్రధాన రహదారి వెంట ఏర్పాటు చేసిన సెలూన్ స్పా సెంటర్, దిల్ సుఖ్ నగర్ కోణార్క్ దయాగ్నోస్టిక్ సెంటర్ పక్కన ఉన్న భవనంలో ఉన్న స్పా సెంటర్ లో కొత్తవారికి అవకాశం లేదంటారని కస్టమర్స్ గా వెళ్లిన వారు దిశ కు తెలిపారు. ముందుగా సర్వీస్ కావాలి అని అడిగితే మీరు కొత్తగా వచ్చారుగా సారి సార్ ఏమి అనుకోవద్దు ఇక్కడ కేవలం పాత కస్టమర్స్ కి మాత్రమే సర్వీస్ ఉంటుంది అని రెసెప్షన్ వారి నుండి జవాబు వచ్చిందని సదరు వ్యక్తులు తెలిపారు. సర్వీస్ కోసం వెళ్లినవారికి నిబంధనల మేరకు సర్వీస్ చేయాలి గాని ఇదేమిటని ప్రశ్నిస్తున్నారు. దీని అర్థం ఏమిటో తెలియడం లేదు. ఇలా చాలా చోట్ల ఇదే పరిస్థితి కొనసాగుతున్నా దాడులు చేయాల్సిన అధికారుల అంతర్గత మతలబు అర్థం కావడం లేదు.



# హస్తం గుర్తుకే ఓటేద్దాం..

**కాంగ్రెస్ పార్టీ నే గెలిపిద్దాం**
**కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్**

**విశాలభారతి,కూకట్ పల్లి:**
చేవెళ్ల పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం రంజిత్ రెడ్డిని వచ్చే పార్లమెంట్ ఎన్నికలలో ఆల్విన్ కాలనీ డివిజన్ తరపున అత్యధిక ఓట్ల మెజారిటీతో గెలిపించుకోవడానికి 124 డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్, శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జిలు సంజీవ రెడ్డి మరియు బి. కృష్ణ ముదిరాజ్, మాజీ కార్పొరేటర్ భాను ప్రసాద్ మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి డివిజన్ పరిధిలోని మహంకాళి నగర్లో పాదయాత్ర చేస్తూ ఇంటింటికి వెళ్లి కాలనీ వాసులను ఆప్యాయంగా పలకరిస్తూ హస్తం గుర్తుకే ఓటు వేయాలని ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు కరపత్రాలు పంచుతూ చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్.జి రంజిత్ రెడ్డికి మీ అమూల్యమైన ఓటు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు మరేళ్ల శ్రీనివాస్, మహిళా అధ్యక్షురాలు శ్రీదేవి, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అనుబంధ మరియు బస్తి కమిటీ సభ్యులు, పార్టీ శ్రేణులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.



# జోరుగా కాంగ్రెస్ ప్రచార హోరు

**చిట్యాల, విశాలభారతి:** భువనగిరి పార్లమెంటు అభ్యర్థి ఛామల కిరణ్ కుమార్ రెడ్డి ఎన్నికల ప్రచారంలో జోరు పెంచారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా చిట్యాల మున్సిపాలిటీ కేంద్రంలో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం తో కలిసి ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి కాంగ్రెస్ పార్టీ చేయి గుర్తుకి ఓటువేసి తనని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేముల మాట్లాడుతూ బీజేపీ ద్వంద వైఖరితో ప్రజలని మోసం చేస్తూ దేశ అభివృద్ధి గాలికొదిలేసిందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ తోనే దేశ అభివృద్ధి జరుగుతుందని అన్నారు. భువనగిరి గడ్డపై కాంగ్రెస్ పార్టీ జెండా ఎగిరెలా చామల కిరణ్ కుమార్ రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. 21వ తేదీన భువనగిరిలో జరగబోయే బహిరంగ సభకు నాయకులు కార్యకర్తలు తరలివచ్చి విజయవంతం చేయాలని
కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ చైర్మన్ కోమటిరెడ్డి చిన్న వెంకటరెడ్డి, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి పోకల దేవదాస్, మండల పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు గుడిపాటి లక్ష్మీనరసింహ, జడల చిన్న మల్లయ్య, కౌన్సిలర్లు వివిధ హోదాలలో ఉన్న నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# భౌతికకాయానికి నివాళులర్పించిన డిసిసి అధ్యక్షులు

**మానుకోట పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ**
**ఎంపీ అభ్యర్థి పోరిక బలరాం నాయక్**
**ఎమ్మెల్యే మురళి నాయక్**

**మహబూబాబాద్, విశాలభారతి :** మున్సిపాలిటీ పరిధిలోని ఈదులపూసపల్లి గ్రామానికి చెందిన మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వెన్నం లక్ష్మారెడ్డి వదిన వెన్నం సుజాత అనారోగ్యంతో మరణించడంతో విషయం తెలుసుకున్న మహబూబాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి శ్రీ పోరిక బలరాం నాయక్ డిసిసి అధ్యక్షులు జెన్నారెడ్డి భరత్ చంద్ రెడ్డి,ఎమ్మెల్యే మురళి నాయక్ ,యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పోరిక సాయి శంకర్ వారి భౌతికయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారితో పాటు ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షులు మేకల వీరన్న యాదవ్, డోర్నకల్ నియోజకవర్గ పార్లమెంట్ ఎన్నికల కోఆర్డినేటర్ జూలకంటి సీతారాం రెడ్డి, జిల్లా నాయకులు హెచ్ వెంకటేశ్వర్లు, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు తోట ఎంకన్న, సీనియర్ నాయకులు ఎండి హరుణ్, గుజ్జునూరి బాబు,సూర్య నాయక్, యూత్ కాంగ్రెస్ నాయకులు వంశీ నాయక్, షేక్ రియాజ్ అన్సారీ, రమేష్ నాయక్, వెంకటేష్, శోభన్ బాబు తదితరులు ఉన్నారు.



# కంటోన్మెంట్ లో కారు ప్రచార రథాలు


**విశాలభారతి,సికింద్రాబాద్ కంటోన్మెంట్:** సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారం రోజురో జుకు ఊపందుకుంది. ఒక వైపు వార్డ్ ల్లో ఇంటింటికి ప్రచారం చేస్తూనే, మరో వైపు ఎన్నికల ప్రచార రథాలతో ప్రచారంకు శ్రీకారం చుట్టారు. కంటోన్మెంట్ బీఆర్ఎస్ ఎన్నికల ఇంఛార్జ్ రావుల శ్రీధర్ రెడ్డితో కలిసి, ఎమ్మెల్యే అభ్యర్థి నివేదిత ప్రచార రథాలను ప్రారంభించారు. కంటోన్మెంట్ లో కారు జెట్ స్పీడ్ తో దూసుకుపోతుందని రావుల శ్రీధర్ రెడ్డి తెలిపారు. ప్రజలందరి దీవెనలతో కంటోన్మెంట్ లో గులాబీజెండా ఎగరడం ఖాయమని ఎమ్మెల్యే అభ్యర్థి నివేదిత తెలిపారు. కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జక్కుల మహేశ్వర్ రెడ్డి, బోర్డు సభ్యులు అనితా ప్రభాకర్, నళిని కిరణ్, పాండు యాదవ్, భాగ్యశ్రీ శ్యాంకుమార్, లోకనాథ్, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ టీఎన్ శ్రీనివాస్, సీనియర్ నాయకులు ఆకుల హరి, నర్సింహ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

**ఇంటింటికి ఎన్నికల ప్రచారం**

కంటోన్మెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి నివేదితకు ప్రచారంలో అపూర్వ స్పందన లభిస్తోంది. 4వ వార్డులో, ఆరోవార్డులో నివేదిత ఎన్నికల క్యాంపెయిన్ నిర్వహించారు..
మాజీ బోర్డు సభ్యురాలు నళిని కిరణ్,మాజీ బోర్డు సభ్యులు పాండు యాదవ్ తో కలిసి ప్రచారంలో పాల్గొన్నారు. నల్గొవ వార్డ్ లోని ముదిరాజ్ బస్తీ, యాదవ్ బస్తీ, అంజనమ్మ కాలనీ, దోభీ కాలనీల్లో ఇంటింటికీ తిరుగుతూ ఓట్లను అభ్యర్థించారు. అరవ వార్డ్ లోని సిఖ్ విలేజ్ తో పాటు పలు కాలనీలు,బస్తీల్లో ప్రజలను కలుస్తూ ముందుకు సాగారు. అందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ బాగోగులను నివేదిత అడిగి తెలుసుకున్నారు.ఒకే ఏడాదిలో ఇద్దరిని కోల్పోయిన సాయన్న కుటుంబానికి అండగా నిలవాలని కోరారు. తనను ఆశీర్వదిస్తే సాయన్నలాగే ప్రజాసేవ చేస్తానని నివేదిత తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ అధ్యక్షులు వినోద్ కుమార్, సీనియర్ నాయకులు శ్రీకాంత్, రామ్మోహన్, సంతోష్, గణేశ్, ఆనంద్, హ్యాపీ టీమ్ సభ్యులు, మహేశ్, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధాశ్రమంలో అన్నదానం

**భద్రాచలం, విశాలభారతి:** తెలంగాణ ఉమెన్స్ స్టేట్ కమిటీ నిర్వహించు ఆల్ ఇండియా ట్రూ క్రిస్టియన్ వారు మానవ సేవ వాలంటరీ ఆర్గనైజ్ వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన తెలంగాణ డిప్యూటీ డైరెక్టర్ ఈ సంతోష్ కుమార్ మాట్లాడుతూ మూడు రోజులు నిర్వహించిన సభలు అనంతరం వృద్ధులకు ఒక పూట అన్నదానం పెట్టడం చాలా సంతోషకరంగా భావిస్తున్నామని ఆయన అన్నారు వృద్ధులను వికలాంగులను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరి మీద ఉందని అన్నారు వృద్ధులకు సేవ చేయడమంటే దేవుడికి సేవ చేయడమేనని ఆయన భావించారు. దానంలో కన్నా అన్నదానం గొప్పదని ఇటువంటి కార్యక్రమాలు అందరూ విధిగా నిర్వహించాలని అప్పుడే దేవుడు బిడ్డలుగా కొనియాడ పడతారని ఆయన పేర్కొన్నారు. ఇంత మంచి కా



ర్యక్రమాన్ని తలపెట్టిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతున్నానని ఆ దేవుడి ఆశీస్సులు ఎప్పుడూ వారికి ఉంటాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టేట్ ఎగ్జిక్యూటివ్ నెంబర్ జయమ్మ, ప్రెసిడెంట్ భూలక్ష్మి, సుజాత రవి మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.



# వైభవంగా శ్రీరామనవమి వసంతోత్సవం

**మరిపెడ, విశాలభారతి:** గుండెపుడి గ్రామంలో ఆలయ ధర్మకర్త నూకల సుధీర్ రెడ్డి, నూకల కిషన్ రెడ్డి, నూకల కిరణ్ రెడ్డి ఆధ్వర్యంలో సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో శ్రీరామనవమి వసంతోత్సవ పూజలు వైభవంగా సాగుతున్నాయి. శనివారం వేకువజామున అర్చకస్వాములు స్వామికి ప్రాతఃకాలార్చన, బాలభోగం నిర్వహించిన తరువాత మంగళాశాసనం, తీర్థ గోష్ఠిని జరిపించారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరుకు స్వామి మంటపం వద్ద శ్రీ మద్రామాయణ పారాయణం, సుందరాకాండ పారాయాణం, దివ్య ప్రబంధ సేవా కాలములను శాస్త్రోక్తంగా జరిపించారు. వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన 25 మంది రుత్విక్కులు స్వామివారి సన్నిధిలో పారాయణాలు చేపట్టారు. మంటపంలో సింహాసనంపై ఆశీనులైన సీతారామచంద్రమూర్తికి లక్ష తులసీ, కుంకుమార్చనలు కొనసాగించారు. యాగశాలలో గాయత్రీ రామాయణం, సంక్షేప రామాయణం, సుందరాకాండ హవనం తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా జరిపించారు. సాయంత్రం 6 గంటలకు యాగశాలలో ఆరాధన, ప్రత్యేక హవనములు, పారాయణాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు సముద్రాల లక్ష్మీ నరసింహ చార్యులు, ముది రెడ్డి ఉప్పిరెడ్డి, గంట్ల పాపిరెడ్డి, కోట కళింగ రెడ్డి ఉపేందర్ రెడ్డి, బోడపట్ల రవి, మల్లరెడ్డి, ఉప్పాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో పారిశుధ్య సమస్యలు ఉండకూడదు

**-ఎంపీడీఓ వెంకట్రాములు**



**కల్వకుర్తి, విశాల భారతి** గ్రామాల్లో ఎలాంటి పారిశుధ్య సమస్యలు తలెత్తకూడదని పంచాయతీ కార్యదర్శులు ఎప్పటికప్పుడు సమస్యలను పరిష్కరించే దిశగా పనిచేయాలని ఎంపీడీవో వెంకట్రాములు సూచించారు. మండల పరిధిలోని సుద్ధకల్, తుర్కలపల్లి గ్రామపంచాయతీ లను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. సుద్ధకల్ గ్రామపంచాయతీలో రికార్డులను పరిశీలించి, అక్కడ ఉన్న అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. గ్రామంలో పారిశుధ్యంపై తీసుకుంటున్న చర్యలపై పంచాయతీ కార్యదర్శులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నరు. అక్కడి నుండి పాఠశాలకు వెళ్లి విద్యార్థుల ప్రతిభ పాటవాలను పరిశీలించారు. అనంతరం నర్సరీకి వెళ్లి నర్సరీలో పెంచుతున్న మొక్కలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. తుర్కలపల్లి గ్రామపంచాయతీలో ప్రత్యేక అధికారితో జరుగుతున్న సమావేశంలో ఆయన పాల్గొన్నారు. గురుకులంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను, అందుకు కారణమైన ఉపాధ్యాయులను ఎంపీడీవో వెంకట్ రాములు అభినందించారు.

# దెబ్బతిన్న పంటలను పరిశీలించిన వ్యవసాయ అధికారి

**ఆర్మూర్, విశాల భారతి**



శుక్రవారం సాయంత్రం కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటను నందిపేట్ మండల వ్యవసాయ అధికారి జోష్నా భవాని శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం దెబ్బతిన్న పంటను ప్రాథమికంగా అంచనా వేశారు. వరి 2003 ఎకరాలు, ఐదు ఎకరాల మామిడి దెబ్బతిన్నట్టు తెలిపారు.



# కాంగ్రెస్ హామీలన్నీ గాలి మాటలే..

**ఉమ్మడి పాలమూరులో రెండు సీట్లు బిజెపి గెలుస్తుంది**

**కల్వకుర్తి, విశాల భారతి:** ఉమ్మడి పాలమూరు జిల్లాలోని రెండు పార్లమెంటు స్థానాల్లో బిజెపి అభ్యర్థులు డీకే అరుణ, భరత్ ప్రసాద్ బంపర్ మెజారిటీతో గెలవడం ఖాయమని బిజెపి రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్దన్ రెడ్డి అన్నారు. కల్వకుర్తి రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఊరుకొండ మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరు గ్యారెంటీల పేరుతో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రజలను మోసం చేయడం జరిగిందని ఆ హామీలు నెరవేర్చడం ఆ పార్టీకి అసాధ్యమని తెలిపారు. 55 ఏళ్లకు పైగా దేశాన్ని పాలించిన కాంగ్రెస్ కుంభకోణాలు అవినీతి అక్రమాలతో కుటుంబ పాలన చేయడం తప్ప దేశ ప్రజలకు చేసింది ఏమీ లేదని ఆరోపించారు. ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో నరేంద్ర మోడీ, అమిత్ షా నాయకత్వంలో 400కు పైగా ఎంపి స్థానాలను గెలుచుకొని ముచ్చటగా మూడోసారి నరేంద్ర మోడీ ప్రధాని కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. సీఎంగా కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించి తెలంగాణ ఆర్థిక వ్యవస్థను సర్వనాశనం చేయడం జరిగిందని, మంత్రిగా కేటీఆర్ ప్రశ్నాపత్రాల లీకేజీతో తెలంగాణ యువత జీవితాలు నాశనం చేశారని, కెసిఆర్ కూతురు ఎమ్మెల్సీ కవిత ఢిల్లీలో లిక్కర్ స్కామ్ చేసి దేశ ప్రజలందరి ముందు తెలంగాణ ప్రతిష్ట దిగజార్చడం జరిగిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి వంశీచంద్ రెడ్డి గత ఎన్నికల్లో పోటీ చేసి కరోనా కష్టకాలంలో ప్రజలకు అందుబాటులో ఉండలేదని అన్నారు. ఈ సమావేశంలో బిజెపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వకీల్ సాబ్ గా రంజిత్ కుమార్



**ధర్పల్లి, విశాల భారతి:** ధర్పల్లి మండలానికి చెందిన గూండ్ల రంజిత్ కుమార్ ట్రాక్టర్ డ్రైవర్ నుండి నల్ల కోటు ధరించి న్యాయవాది అయ్యారు. బాల్య దశలో ట్రాక్టర్ డ్రైవర్ గా, విద్యార్థి దశలో అఖిల భారత విద్యార్థి పరిషత నాయకుడిగా,విద్యార్థుల సమస్యలపై పోరాడే నాయకుడిగా ఎదిగాడు, వ్యాపార రంగంలో చిన్నపాటి మెడికల్ నడిపించి, నేడు బార్ కౌన్సిల్ ఆఫ్ తెలంగాణ నుండి పట్ట పొంది న్యాయవాది వృత్తిని రంజిత్ కుమార్ చేపట్టారు. నేటి యువకులకు రంజిత్ ఆదర్శప్రాయంగా నిలిచాడు. తెలంగాణ ఉద్యమంలో లాటీ దెబ్బలకు వెన్ను చూపి ఉద్యమ బాటలో స్ఫూర్తిదాయకుడు,ప్రశ్నించే తత్వం ఆయన నైజం. ఈరోజు కోర్టులో నల్లకోటు ధరించిన ధర్పల్లి గ్రామ న్యాయవాదిగా పేరు తీసుకొచ్చారు.



# సైబర్ నేరాలపై అవగాహన సదస్సు

**బాల్కొండ, విశాల భారతి:** సైబర్ నేరాల పట్ల ప్రజలు, విద్యార్థులు, యువత పూర్తిగా అవగాహన కలిగి ఉండి, తగు జాగ్రత్తలు తీసుకోవాలని భీమ్‌గల్ ఏఎస్సై చిరంజీవి అన్నారు. నిజామాబాద్ సిపి కల్మేశ్వర్ ఆదేశాల మేరకు భీమ్‌గల్ సిఐ శ్రీనివాస్,ఎస్సై హరిబాబు అధ్వర్యంలో బాబాపూర్ గ్రామంలో సైబర్ నేరాల నియంత్రణ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్సై చిరంజీవి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో సైబర్ నేరగాళ్లు రోజుకు రూ. 5కోట్ల వరకు దోచుకుంటున్నారని అన్నారు. కాబట్టి ప్రజలు తమ వ్యక్తిగత,బ్యాంకింగ్,ఓటీపీ వివరాలు అపరిచితులతో పంచుకోవద్దని సూచించారు. ఫోన్‌లలో పేటీఎం,గూగుల్ పే,ఫోన్ పే,కేవైసీలను అప్‌డేట్ చేయమని వచ్చే మెసేజ్‌లకు స్పందించకూడదన్నారు. సైబర్ నేరాలకు గురైనప్పుడు 1930 ట్రోల్‌ఫ్రీ నంబర్‌కు డయల్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది సుదీర్, అశోక్, చలపతి, మధు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# నామినేషన్ స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యేలు

**ఆర్మూర్, విశాల భారతి** నిజామాబాద్ కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి తటిపర్తి జీవన్ రెడ్డి సోమవారం నూతన కలెక్టరేట్ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేయనున్నారు. నామినేషన్ వేసిన తర్వాత పాత కలెక్టరేట్ ప్రాగణంలో సభ నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొననున్నారు. కావున శనివారం బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, జిల్లా అధ్యక్షులు సొసైటీ యూనియన్ లిమిటెడ్ కార్పొరేషన్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డితో కలిసి సభ స్థలాన్ని కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఇంచార్జ్ పొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి పరిశీలించారు.





## కాంగ్రెస్ నేత 'కాట' అధ్వర్యంలో..

# మెదక్ కు భారీగా తరలిన కాంగ్రెస్ శ్రేణులు

**జెండా ఊపి ర్యాలీ ప్రారంభించిన మంత్రి కొండ సురేఖ**

**పటాన్ చెరు,విశాలభారతి:** మెదక్ ఎంపీ అభ్యర్థి నీలం మధు నామినేషన్ దాఖలు చేయనున్న సందర్భంగా కాంగ్రెస్ పటాన్ చెరు నియోజకవర్గ ఇంచార్జి కాటా శ్రీనివాస్ గౌడ్ అధ్వర్యంలో మెదక్ పట్టణానికి కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలి వెళ్లారు. పటాన్ చెరు నియోజకవర్గం గుమ్మడిదల టోల్ గేట్ వద్ద పటాన్ చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి కాట శ్రీనివాస్ గౌడ్, ఎంపీ అభ్యర్థి నీలం మధుతో కలిసి మంత్రి కొండ సురేఖ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. భారీ ర్యాలీలో కాట శ్రీనివాస్ గౌడ్ తో కలిసి వేలాది కాంగ్రెస్ పార్టీ సైనికులు, కె.ఎస్.జీ యువసేన సభ్యులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. పటాన్ చెరు అసెంబ్లీ కోఆర్డినేటర్ శ్యామ్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, కె.ఎస్.జీ యువసేన సభ్యులు పాల్గొన్నారు.

**సీఎం రేవంత్ రెడ్డిని స్వాగతం పలికిన కాట..**

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మెదక్ జిల్లాకు విచ్చేసిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ పటాన్ చెరు నియోజకవర్గ ఇంచార్జి కాట శ్రీనివాస్ గౌడ్ ఘనంగా స్వాగతం పలికారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధు నామినేషన్ సందర్భంగా మెదక్ కు వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కాట శ్రీనివాస్ గౌడ్ స్వాగతం పలికి శాలువతో సత్కరించారు.



# నవ దంపతులను ఆశీర్వదించిన ప్రభుత్వ విప్

**డోర్నకల్, విశాలభారతి:** మండలంలోని తొడలగూడెం గ్రామానికి చెందిన ఓ ని ఫంక్షన్ మరియు సిరోల్ అందనాలపాడు గ్రామం శీతల తండా చెందిన వివాహ వేడుకల్లో పాల్గొన్న ప్రభుత్వ శాసనసభ్యులు డాక్టర్ రామచంద్రనాయక్ మరియు మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థి పోరిక బలరాం నాయక్ , తదితరులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన పథకాలు పాంచ్ న్యాయ్ పథకాలు అమలు చేస్తా

**పార్లమెంటు అభ్యర్థి పట్నం సునీత మహేందర్ రెడ్డి**

**కూకట్ పల్లి,విశాలభారతి:** పార్లమెంట్ ఎన్నికల అనంతరం కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో ప్రకటించిన 6 గ్యారంటీలు పాంచ్ న్యాయ పథకాలు అమలు చేస్తామని మల్కాజిగిరి పార్లమెంటు నియోజకవర్గం అభ్యర్థి పట్నం సునీత మహేందర్ రెడ్డి పేర్కొన్నారు. నియోజకవర్గం పార్టీ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రాత్రి కూకట్ పల్లి, బాలానగర్, ఫతేనగర్ డివిజన్ల లో కూకట్ పల్లి అసెంబ్లీ నియోజకవర్గం ఇంచార్జ్ బండి రమేష్, స్థానిక నాయకులు కార్యకర్తలతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ కాంగ్రెస్ కార్యకర్తలను గత ప్రభుత్వం ఎన్ని ఇబ్బందులు పెట్టి కేసులు పెట్టినా అదరక బెదరక పార్టీ విజయానికి కృషి చేశారని, అలాంటి వారిని పార్టీ తప్పక గుర్తిస్తుందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు, దళిత బంధు, రైతు నేస్తం వంటి పథకాలలో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని సునీత విమర్శించారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను గడపగడపకు తీసుకువెళ్లి పార్టీ పట్ల సానుకూలత పెంచాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వాన్ని బలపరచాల్సిన అవసరం ఉందన్నారు. పార్టీ కోసం పనిచేసే వారు మాత్రమే ఉండాలని గ్రూపులతో తగాదాలతో పార్టీ పరువును దిగజార్చవద్దనీ హెచ్చరించారు. కూకట్ పల్లి ఇంచార్జ్ బండి రమేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి ఘనమైన చరిత్ర ఉందని ఆ పార్టీ కార్యకర్తగా ఉండటం గొప్పగా భావిస్తాను అన్నారు పార్లమెంట్ ఎన్నికల్లో 350 నుంచి 400 సీట్లు గెలిచి కేంద్రంలో ఇండియా కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందన్నారు అన్ని కులాలను అన్ని మతాలను కాంగ్రెస్ పార్టీ అక్కున చేర్చుకుంటుందన్నారు. దేశ ప్రజలను బిజెపి అన్ని రకాలుగా మోసం చేసిందన్నారు గ్యాస్ పెట్రోల్ డీజిల్ ధరలను పెంచి సామాన్యుడికి అందుబాటులో లేకుండా చేసిందన్నారు పార్టీలో ఎన్ని భిన్నాభిప్రాయాలు ఉన్నా అందరినీ కలుపుకుని పోతామన్నారు. అభివృద్ధి కావాలంటే కాంగ్రెస్ రావాలని అందుకే కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని రమేష్ కార్యకర్తలను ప్రజలను గట్టిగా కోరారు. కార్యక్రమంలో టిపిసిసి అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి ఏ, బి బ్లాక్ అధ్యక్షులు నాగిరెడ్డి తూమువేణు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు డివిజన్ అధ్యక్షులు మాజీ కౌన్సిలర్లు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఎన్నికల నిర్వహణపై ర్యాండమేజేషన్



**వనపర్తి విశాల భారతి:**

పార్లమెంటు ఎన్నికల నిర్వహణకు మొదటి ర్యాండమైజేషన్ అనంతరం ఈ వి.యం లను వనపర్తి సహాయ రిటర్నింగ్ అధికారి యం.నగేష్ కు అప్పగిస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి తేజస్ నంద లాల్ పవార్ తెలిపారు. శనివారం ఆర్డీవో కార్యాలయ ఆవరణలో ని ఈ .వి.యం గోదాం నుండి ప్రజా ప్రతినిదుల సమక్షంలో క్లోజ్డ్ కంటైనర్ లో పోలీస్ భద్రతతో చిట్యాల వ్యవసాయ మార్కెట్ యార్డు గోడౌన్ కు తరలించారు. ఎన్నికల కమిషన్ సూచనల మేరకు బ్యాలెట్ యూనిట్స్, కంట్రోల్ యూనిట్స్, వీవీ ప్యాట్స్ లను పోలీసు బందోబస్తు నడుమ చిట్యాలలోని వ్యవసాయ మార్కెట్ యార్డు గోడౌన్ కు తరలిస్తున్నట్లు తెలిపారు. జిల్లా సహాయ రిటర్నింగ్ అధికారి యం. నగేష్, తహసిల్దార్ యాదగిరి, రమేష్ రెడ్డి, భాజపా ప్రతినిధులు దాసరాజు ప్రవీణ్, కుమారస్వామి, సీపీఎం ప్రతినిధి పరమేశ్వరాచారి, కాంగ్రెస్ ప్రతినిధి వేణాచారి, బీఎస్పీ నుంచి భరత్, తెదేపా ప్రతినిధి శేఖర్, ఎంఐఎం ప్రతినిధి రహీమ్ ల సమక్షంలో తరలింపు జరిగింది.



# పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేసిన తహసీల్దార్

**సిరికొండ, విశాల భారతి:** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సిరికొండ మండల తహసీల్దార్ రవీందర్ రావు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అమ్మ ఆదర్శ పాఠశాల పనులైన విద్యుద్ధీకరణ,మంచి నీటి సరఫరా, మైనర్ రిపేర్లు, మొదలగు పనుల పురోగతిని పర్యవేక్షించారు. అనంతరం మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం జరుగుతుందా లేదా అని స్వయంగా మధ్యాహ్న భోజనాన్ని భుజించి పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల

గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు శ్రీ సతీష్ కుమార్ ,ఉపాధ్యాయులు సునీత యూసుఫ్ ఖాన్, అన్నపూర్ణ,మోతిలాల్,అబ్బయ్య,రాచర్ల గంగాధర్, రాజమని, జమున తదితరులు పాల్గొన్నారు.



# ప్రత్యేక అధికారిగా బాధ్యతలు చేపట్టిన ఎంపీడీవో

**భీమదేవరపల్లి విశాల భారతి** మండలంలోని ముల్కనూర్ మేజర్ గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారిగా ఎంపీడీవో నాగంపల్లి వీరేశం శనివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ప్రత్యేక బాధ్యతలు చేపట్టిన డిఎల్పివో బనావత్ సుదర్శన్ ఎలక్షన్ విధుల్లో భాగంగా వెళ్లారు. ఈ సందర్భంగా నూతన బాధ్యతలు చేపట్టిన ఎంపీడీవోకి పంచాయతీ కార్యదర్శి , సిబ్బంది ప్రజాప్రతినిధులు పుష్ప గుచ్చం అందించి శుభాకాంక్షలు తెలిపారు.



# కాంగ్రెస్ పార్టీలో భారీగా చేరికలు

**నారాయణఖేడ్, విశాల భారతి** బీబీ పెట్ మండలంలో పలు గ్రామాలకు చెందిన బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వ సలహాదారు శబ్బీర్ అలీ, జహీరాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి సురేష్ షేట్కర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పతకాలకు ఆకర్షితులై పెద్ద ఎత్తున నాయకులు కాంగ్రెస్ పార్టీలోకి చేరడం జరుగుతుంది అని తెలిపారు.అలాగే బీబీ పెట్ మండల కేంద్రములో కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ప్రారంభించడం జరిగింది.



# కేంద్ర మంత్రిని కలిసిన బీజేపి సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి

**పటాన్ చెరు,విశాలభారతి:** పటాన్ చెరు మండలం ముత్తంగి రింగురోడ్డు వద్ద భారతీయ జనతా పార్టీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజి రెడ్డి కేంద్ర కెమికల్ మరియు ఫర్టిలైజర్స్ మంత్రి భగవంతు క్యూబాను మర్యాదపూర్వకంగా కలిశారు. పూలబొకే అందించి శాలువతో సన్మానించారు. జిల్లాలోని రెండు పార్లమెంటు నియోజకవర్గాల్లో బీజేపి అభ్యర్థులను గెలిపించాలని మంత్రి కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు డాక్టర్ అంజిరెడ్డి, బిజెపి నాయకులు కృష్ణారెడ్డి, సాయి కృష్ణ, మల్లేష్, వీరేష్, చందు, శాస్త్రి, తదితరులు పాల్గొన్నారు.



# సోలార్ ద్వారా తాగునీరు అందించిన ఎంపీఓ

**పినపాక, విశాలభారతి :** జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పినపాక మండలంలో తాగునీటికి ఇబ్బంది లేకుండా పూర్తిస్థాయిలో ఏర్పాటు చేస్తున్నామని పినపాక ఎంపీఓ వెంకటేశ్వరరావు తెలియజేశారు. శనివారం పినపాక మండలం అమరారం గ్రామ పంచాయతీ పిట్టతోగు గ్రామంలో సోలార్ ప్లేట్ల ని ఏర్పాటు చేసి తాగునీటిని కల్పించారు. పిట్టతోగు గ్రామానికి కనీసం విద్యుత్ సౌకర్యం లేక పక్కనే ఉన్న చెలిమ ద్వారా బురద నీరు తాగుతున్నారని బృహస్పతి , తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం నాయకులు మడివి రమేష్ ద్వారా తెలుసుకొని ఆ ప్రాంతాన్ని సందర్శించిన విషయం తెలిసిందే. శనివారం ఆ గ్రామంలో స్థానిక సెక్రటరీ తో కలిసి బోర్ క్లీన్ చేయించి మోటర్ ద్వారా సోలార్ ప్లేట్ల సహాయంతో నీటిని అందించారు. ఈ సందర్భంగా ఎంపివోకు ఆదివాసి వలస గిరిజనులు కృతజ్ఞతలు తెలియజేశారు. గతంలో ఎన్నో సంవత్సరాలుగా తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడ్డామని, కనీసం రోడ్డు సౌకర్యం కూడా లేక అనారోగ్యం వస్తే మంచానికి కట్టుకొని తీసుకుపోయిన రోజులు ఉన్నాయని ఆయన ముందు తమ ఆవేదన తెలియజేశారు. తన పరిధిలో సాధ్యమయ్యే సమస్యలను పరిష్కరిస్తారని ఎంపీ ఓ వారికి తెలియజేశారు. గ్రామంలో గల సమస్యలను ఐటిడిఏ పిఓ, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట సెక్రటరీ వెంకటేశ్వర్లు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



# నిజామాబాద్ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరాలి

**ముత్యాల సునీల్ కుమార్**

**బాల్కొండ,విశాలభారతి:** నిజామాబాద్ పార్లమెంట్ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరవేయడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని బాల్కొండ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ అన్నారు. శనివారం బాల్కొండ నియోజకవర్గం ఏర్గట్ల మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు బాల్కొండ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. చేరిన వారిలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు ఓర్సు రాములు, అలాగే వడ్డెర సంఘం, కూరాకుల ముదిరాజ్ సంఘం,బర్మ పెద్ద సంఘం మొత్తం 100 మంది కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ముత్యాల సునీల్ కుమార్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జీవన్ రెడ్డి గెలుపే లక్ష్యంగా పనిచేయాలని అన్నారు. రానున్న రోజుల్లో సిఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దేవారెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు శివన్నోళ్ళ శివకుమార్, బద్దం లింగారెడ్డి, రాజారెడ్డి, పురుషోత్తం కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# హామీల అమలులో కాంగ్రెస్ పార్టీ ఘోర విఫలం

- 10 ఏళ్లలో బీజేపీ చేసింది ఏమీ లేదు.
- వెంకట్రామ్ రెడ్డికి భారీ
- మెజారిటీ అందిస్తాం
- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



**పటాన్ చెరు,విశాలభారతి:** తెలంగాణ ప్రజలకు అరచేతిలో స్వర్గం చూపించి అధికారంలో వచ్చిన కాంగ్రెస్ పార్టీ, హామీల అమలులో పూర్తిగా విఫలం చెందిందని, రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీని గెలిపించి కాంగ్రెస్ పార్టీ చెంప చెల్లుమనిపించాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం సాయంత్రం..పటాన్ చెరులో ఏర్పాటు చేసిన పటాన్ చెరు డివిజన్, పటాన్ చెరు మండల బిఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో గత పది సంవత్సరాల కాలంలో తొమ్మిది వేల కోట్ల రూపాయలతో పటాన్ చెరు నియోజకవర్గాన్ని అభివృద్ధికి ప్రతీకగా నిలిపామని తెలిపారు. అభివృద్ధిలో పక్షపాతం లేకుండా పార్టీలకు అతీతంగా అందరికీ నిధులు కేటాయించి, ప్రజాపాలన అందించడం జరిగింది అని తెలిపారు. ఇందుకు పూర్తి విరుద్ధంగా ప్రస్తుత అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రజలను దోచుకోవడమే లక్ష్యంగా పనిచేస్తూ, అభివృద్ధి నిరోధకులుగా మారిపోయారని విమర్శించారు. ఎవరెన్ని కుట్రలు పన్నినా బిఆర్ఎస్ పార్టీ విజయాన్ని ఆపలేరని విమర్శించారు. రాబోయే ఎంపీ ఎన్నికల్లో వెంకట్రాంరెడ్డి విజయానికి సైనికుల వలె పని చేయాలని కోరారు. ఈ నెల 22 న పటాన్ చెరులో నిర్వహించతలబెట్టిన పటాన్ చెరు డివిజన్, పటాన్ చెరు మండలం ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ కుమార్, సీనియర్ నాయకులు శంకర్ యాదవ్, సపాన దేవ్, మాజీ ఎంపీపీ లు యాదగిరి యాదవ్, శ్రీశైలం యాదవ్, పార్టీ మండల అధ్యక్షులు పాండు, డివిజన్ అధ్యక్షులు అఫ్జల్, దశరథ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, గూడెం మధుసూదన్ రెడ్డి, కుమార్ గౌడ్, చంద్ర శేఖర్ రెడ్డి, గోపాల్, ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# చలివేంద్రం పెట్టారు.. కుండల్లో నీరు నింపడం మరిచారు

**గార్ల, విశాలభారతి:** మండల స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో స్థానిక నెహ్రూ కూడలి పరిధిలో ఏర్పాటు చేసిన చలి వేంద్రంలో శనివారం కుండలలో తాగునీరు పోయటం మర్చిపోయారు. మంచినీటి కోసం వచ్చిన ప్రజలు తిరిగి వెళ్ళిపోతున్నారు. ఎండలు విపరీతంగా పెరిగినందువలన వేరే వేరే గ్రామాల నుండి ప్రజలు మండల కేంద్రానికి వారి పనులకై వస్తే చల్లని నీరు కొనుక్కొని తాగలేని పరిస్థితి వివృత్తంగా ఎండ కొడుతున్న సందర్భంగా కొట్టుమిట్టు ఆడుతూ చలివేంద్రాల కాడికి నీటి దాహం తీర్చుకోవడానికి వెళ్తారు కానీ ఆ యొక్క చలి వేంద్రంలో నీరుని పోయకపోవడం కాదు తక్షణమే మేజర్ గ్రామపంచాయతీ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కోరారు.



# కాంగ్రెస్ జెండా ఎగరవేయడమే లక్ష్యంగా పనిచేస్తాం

**రేవంత్ రెడ్డి బహిరంగ సభను విజయవంతం చేయాలి**

**కల్వకుర్తి, విశాల భారతి** నాగర్ కర్నూల్ పార్లమెంటు పై కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరడమే లక్ష్యంగా యూత్ కాంగ్రెస్ పని చేస్తుందని కాంగ్రెస్ నాగర్ కర్నూల్, రంగారెడ్డి జిల్లాల అధ్యక్షులు కోడిదల రాము, పాలకూర్ల రవికాంత్ గౌడ్ అన్నారు. కల్వకుర్తి పట్టణంలో శనివారం వారు సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. రాహుల్ గాంధీ ప్రధానిని చేయడమే లక్ష్యంగా నాగర్కర్నూల్ పార్లమెంట్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేసే లక్ష్యంగా యువజన కాంగ్రెస్ నాయకులు డోర్ టు డోర్ ప్రచారం నిర్వహించాలని తెలిపారు. మల్లు రవి గెలుపులో యూత్ కాంగ్రెస్ మెరుగైన పాత్ర వహించాలని తెలిపారు.

**ముఖ్యమంత్రి బహిరంగ సభను విజయవంతం చేయాలి:**

ఈ నెల 23 న బిజినేపల్లిలో నిర్వహించబోయే సభని యువజన కాంగ్రెస్ నాయకులు విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ బహిరంగ సభకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశంలో తాలుకా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు రాపోతు అనిల్ గౌడ్, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు బీస బాలరాజు, యూత్ కాంగ్రెస్ నాయకులు దున్న సురేష్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం

**బాల్కొండ,విశాలభారతి:** పార్లమెంట్ ఎన్నికల్లో బాల్కొండ నియోజకవర్గం నుండే అత్యధిక మెజారిటీ వస్తుందని నిజామాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి జీవన్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. శనివారం ఉమ్మడి బాల్కొండ మండలం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం ముప్కాల్ లోని మణికంఠ పంక్షన్ హాల్ లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పార్లమెంట్ అభ్యర్థి జీవన్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా బాల్కొండ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి ముత్యాల సునీల్ కుమార్ మాట్లాడుతూ శాసన సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఎంతో కష్టపడ్డారని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో మచ్చలేని నాయకుడు జీవన్ రెడ్డి గెలుపు కోసం అంతకంటే ఎక్కువ కష్టపడాలని పిలుపునిచ్చారు. అనంతరం పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి జీవన్ రెడ్డి మాట్లాడుతూ 7 నియోజకవర్గాలలో బాల్కొండ నుండే అత్యధిక మెజారిటీ వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తనను గెలిపిస్తే బాల్కొండ రైతాంగానికి అండగా ఉంటానని తెలిపారు. అనంతరం బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్ పార్టీలోకి పెద్ద ఎత్తున జీవన్ రెడ్డి సమక్షంలో చేరికలు జరిగాయి. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.



# ముగిసిన శ్రీరామనవమి ఉత్సవాలు

**సిరికొండ, విశాల భారతి** నిజామాబాద్ జిల్లా సిరికొండ మండల కేంద్రంలోని శ్రీ శేష సాయి లక్ష్మీ నారాయణ ఆలయంలో శ్రీరామనవమి ఉత్సవాలు శనివారం నాలుగవ రోజుతో ఘనంగా ముగిశాయి. చివరి రోజు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పూర్ణాహుతి అభిషేకం బలి కార్యక్రమాన్ని పండితులు నాగరాజ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని బుధవారం నుండి శనివారం వరకు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ కమిటీ, గ్రామ ప్రజల సమక్షంలో ఘనంగా నిర్వహించారు.

# పంచాయతీ కార్యదర్శుల సంఘం ఎన్నిక

**భీమదేవరపల్లి, విశాల భారతి** మండలంలోని పంచాయతీ కార్యదర్శుల కమిటీ ఎన్నికలు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీడీవో వీరేశం సమక్షంలో నిర్వహించారు. ఈ సమావేశంలో అధ్యక్షుడిగా జంగం పూర్ణచందర్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులు సదానందం, ప్రధాన కార్యదర్శి సురేందర్,కోశాధికారి సరిత, గౌరవ అధ్యక్షుడిగా వెంకటేష్, ప్రచార కార్యదర్శిగా అనంతరెడ్డి, సహ కార్యదర్శిగా రాజేంద్రప్రసాద్, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నట్లు నూతన అధ్యక్షుడు తెలిపారు. ఆయన మాట్లాడుతూ కార్యదర్శుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని నూతన కమిటీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



# పార్లమెంటు ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరేస్తాం

**మాజీ మంత్రి ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్**

**మహబూబాబాద్, విశాలభారతి:** సాక్షాత్తు రాష్ట్రముఖ్యమంత్రి కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారసభకు హాజరై.., జనం ఎవరు రాక., ఖాళీ కుర్చీలతో ఉన్న వేదిక వద్దకు వెళ్లలేక గంటకు పైగా బస్సులో కూర్చుని ప్రజలకోసం ఎదురుచూసే పరిస్థితి దాదాపుగా మహబూబాబాద్ లో తప్ప మరెక్కడ చూసి ఉండమని, ఈ సంఘటనతోనే పార్లమెంటు పరిధిలో కాంగ్రెస్ పార్టీకి ఉన్న బలం ఏమిటో తెలిసిపోయిందని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్సీ క్యాంపు కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ పైన తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. ముఖ్యమంత్రి తొలిసారిగా మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి వస్తే జిల్లా ప్రజలకు, పార్లమెంట్ పరిధిలోని ప్రజలకు ఎలాంటి వరాలు ఇస్తారోనని ప్రజలంతా ఎదురు చూశారని, కానీ ఒక్కటంటే ఒక్క మాట కూడా ఇవ్వకుండా. వట్టి చేతులు ఊపి వెళ్లిపోయారని ఎద్దేవా చేసారు. కాంగ్రెస్ తరపున పోటీ చేస్తున్న ఎంపీ అభ్యర్థిగాని, మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలో ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్యేలు గానీ ముఖ్యమంత్రి దృష్టికి సమస్యలను తీసుకువెళ్లి, ప్రజల అవసరాలను వివరించి కొన్ని హామీలైన పొందాల్సి ఉండేదని, కానీ వారికి ఆ..సమర్థత లేదని నిన్నటి బహిరంగ సభతో ప్రజలందరికీ తెలిసిపోయిందన్నారు. బిఆర్ఎస్ పార్టీని విమర్శించడం తప్ప నిర్మాణాత్మకమైన ఒక్క మాట కూడా ముఖ్యమంత్రి తన ప్రసంగంలో చెప్పకపోవడం విచారకరమన్నారు. అప్పటికే సభకు జనం రాక అసహనంతో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జనాన్ని కదలించ లేక పోయిన కాంగ్రెస్ పార్టీ నాయకుల మీద ఆగ్రహాన్ని మహబూబాబాద్ పార్లమెంటు ప్రజలపై చూపారని, అందుకే ఒక్క హామీ, ఒక్క వరం కూడా ఇవ్వకుండా వెళ్లిపోయారని సత్యవతి రాథోడ్ తెలిపారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మహబూబాబాద్ నియోజకవర్గంలో మూడవ స్థానమే దక్కుతుందని నిన్నటి సభతో తేలిపోయిందన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ తక్కెళ్ళపల్లి రవీందర్ రావు, మాజీ ఎమ్మెల్యే భానోత్ శంకర్ నాయక్, జడ్పీ చైర్ పర్సన్ ఆంగోత్ బిందు, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ పాల్వాయి రామ్మోహన్ రెడ్డి, వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



# బాలాజీ ఏజెన్సీ గ్యాస్ దందా

**కస్తమర్ల నుండి ఆకమ వసూళ్లు చర్యలు తీసుకోవాలని సిపిఐ(ఎం) డిమాండ్**

**చిట్యాల, విశాలభారతి:** తనిఖీల పేరుతో గ్యాస్ వినియోగదారుల నుండి డబ్బులు వసూలు చేస్తున్న చిట్యాల బాలాజీ హెచ్.పీ గ్యాస్ ఏజెన్సీ వారిపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సిపిఐ (ఎం) పార్టీ ఆధ్వర్యంలో చిట్యాల మండల డిప్యూటీ తహసీల్దార్ కి వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలకు సబ్సిడీ గ్యాస్ లు ఇస్తున్నామని చెప్తున్నా ఏజెన్సీ వాళ్ళు మాత్రం రాత్రికి రాత్రి ప్రభుత్వ అధికారులకు తెలవకుండా గుండ్రాంపల్లి గ్రామంలో డప్పు చాటింపు చేసి గ్యాస్ వినియోగదారులు ఆధార్ కార్డు, 230 రూపాయలు చెల్లించి మీ ఇంటికి తనిఖీ చేయడానికి వచ్చిన వారికి ఇవ్వాలని చెప్పడంతో గ్రామంలో వినియోగదారులు చాలామంది శ్రీ బాలాజీ ఏజెన్సీ చిట్యాల కంపెనీ ఏజెంట్లకు డబ్బులు చెల్లించారు. ఇలాంటి దందా లు చేస్తున్న శ్రీ బాలాజీ ఏజెన్సీ పై తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో సిపిఐ (ఎం) పార్టీ జిల్లా కమిటీ సభ్యులు జిట్ట నగేష్, మండల కమిటీ సభ్యులు కత్తుల లింగస్వామి, గుండ్రాంపల్లి గ్రామ శాఖ కార్యదర్శి కత్తుల యాదయ్య పాల్గొన్నారు.



# సైబర్ నేరాల నివారణ కు కృషి చేయాలి

**సైబర్ సెక్యూరిటీ డీఎస్పీ శ్రీనివాసరావు**

**సూర్యాపేట, విశాలభారతి:** ప్రస్తుత సమాజంలో సాంకేతికత పెరిగి అదే స్థాయిలో అంతర్జాల ఆర్థిక మోసాలు పెరిగినాయి అని జిల్లా సైబర్ సెక్యూరిటీ డీఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. జిల్లా ఎస్పి రాహుల్ హెగ్డే ఐపిఎస్ గారి ఆదేశాల మేరకు శనివారం ఎస్పి కార్యాలయం నందు పోలీసు సిబ్బందికి సైబర్ మోసాల నివారణ పై అవగాహన శిక్షణ తరగతి నిర్వహించారు. సామాజిక మద్యమాలకు బలమైన పాస్ వర్డ్ పెట్టుకోవాలి, పుట్టిన తేదీలు, ఫోన్ నంబర్ లాంటి పెట్టుకోవడం వల్ల మన ఫేస్బుక్ లాంటి అకౌంట్స్ సైబర్ మోసగాళ్ళు హ్యాక్ చేస్తున్నారు అని అన్నారు. అలాగే మొబైల్ నందు యాప్స్ ను డౌన్లోడ్ చేసే క్రమంలో ఫోన్ అనుమతలు ఇవ్వడం వల్ల కూడా సైబర్ మోసాలకు గురౌతాం అని డీఎ స్పీ తెలిపినారు. సైబర్ నేరాల తీరుపై జిల్లా పోలీసు కళాభృందం వారు చక్కటి సాంస్కృతిక పాటలతో అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమం నందు సైబర్ సెక్యూరిటీ ఇన్స్పెక్టర్ లక్ష్మినారాయణ, ఆర్ ఎస్ ఐ అన్వర్, కళాబృందం సభ్యులు, ఆర్మడ్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



# కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటాం

**ప్రభుత్వ విప్,**
**ఎమ్మెల్యే రామచంద్రునాయక్.**
**స్టేట్ ఫైనాన్స్ కమీషన్ సభ్యులు**
**నెహ్రూనాయక్.**

**కురవి, విశాలభారతి:** కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే రామచంద్రునాయక్, స్టేట్ ఫైనాన్స్ కమీషన్ సభ్యులు నెహ్రూనాయక్ లు అన్నారు. కురవి మండలంలోని గుండ్రాతి మడుగు కాంగ్రెస్ పార్టీ యువ మండల నాయకులు సుంచు శేఖర్, గ్రామ పార్టీ అధ్యక్షుడు వెలి మిశెట్టి కృష్ణ, యూత్ అధ్యక్షుడు శ్రీధర్, పత్తి వెంకటేష్, కొలువుల కృష్ణ, ఆధ్వర్యంలో శనివారం 50 మంది యువకులు డోర్నకల్ ఎమ్మెల్యే ప్రభుత్వ చీఫ్ రామచంద్రనాయక్, స్టేట్ ఫైనాన్స్ కమీషన్ సభ్యులు నెహ్రూనాయక్ సమక్షంలో చేరారు. చేరిన వారిలో గ్రామ యూత్ సాదిక్, చిలువుల నాగేష్, అక్షయ్, లోకేష్, వీరబాబు, పవన్, నితిన్, అఖిల్, బన్నీ, నితిన్ ,ఆదిత్య, సంతోష్, నవీన్, బబ్లు, విష్ణు, నవీన్, అఖిల్, రాకేష్, మొత్తం 50 మంది యూత్ సభ్యులు కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకోవడం జరిగింది. వారికి పార్టీ కాండువాలు కప్పి స్వాగతించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఇప్పటికే ఐదు హామీలు అమలు జరిగాయాన్నారు. వచ్చే ఆగస్టు 15 నాటికి రైతు రూ. రెండు లక్షల రుణమాఫీ జరుగుతుందని హామీ ఇచ్చారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బలరాం నాయక్ ని అధిక మెజార్టితో గెలిపించి సోనియామ్మకు బహుమతిగా ఇచ్చేందుకు పార్టీ కార్యకర్తలు, నాయకులు సైనికుల్లా పని చేయాలని కోరారు.

# ఓటు హక్కు భారం కాదు మన బాధ్యత

**జిల్లా ఎన్నికల అధికారి,**
**కలెక్టర్ ఎస్. వెంకట్రావ్**



**సూర్యాపేట, విశాలభారతి:** రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్. వెంకట్రావ్ అన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఓటు అవశ్యకతపై వృద్ధులు, వికలాంగులు అలాగే ట్రాన్సజెండర్స్ లతో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం కల్పించిన సదుపాయాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. జిల్లాలో మొత్తం వృద్ధులు 17216 మంది ఉండగా వారిలో 85 సంవత్సరాలు వయస్సు పైబడిన వారు 6425 మంది , ట్రాన్స్ జెండర్స్ 55, అంగవైకల్యం ఉన్నవారు 13421. కలరని అన్నారు. ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్ లో గుర్తించిన కేంద్రాల్లో ఓటు హక్కు సద్వినియోగం చేసుకునేందుకు వీలుగా 729 వీల్ చైర్, ఆటో సదుపాయం, వాలంటరీలను ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో వికలాంగులు 96 శాతం ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారని అన్నారు. వృద్ధులు, వికలాంగులు, ట్రాన్స్ జెండర్స్ లకు ఓటు అవశ్యకతపై స్వీప్ కార్యక్రమాలు సంబంధిత శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని అన్నారు. పోలింగ్ రోజున 85 పైబడిన అలాగే మంచానికే పరిమితమైన వారికి హోమ్ ఓటింగ్ సద్వినియోగం చేసుకునేలా పటిష్ఠ చర్యలు తీసుకుంటామని తెలిపారు. నాలుగు అసెంబ్లీ సెగ్మెంట్ ల 729 ప్రాంతాల్లో సదుపాయాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

జిల్లా సంక్షేమ అధికారి వెంకట రమణ మాట్లాడుతూ దివ్యాంగులకి,వయో వృద్ధుల కి, ట్రాన్స్ జెండర్స్ కోసం వారి ఓటు హక్కు వినియోగించారు. సమావేశంలో డి డబ్ల్యూ వో వెంకటరమణ, సిడిపివోలు కిరణ్మయి, శ్రీవాణి, శ్రీజ, రూపా, సాయి గీత సూపర్ వైజర్లు జగతి కళాశాల ప్రిన్సిపాల్ మెగోమి, దివ్యాంగ విద్యార్థులు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ప్రతిష్టాపన కార్యక్రమంలో డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్

**కురవి, విశాలభారతి**: మండలంలోని సూర్య తండా గ్రామంలో నూతనంగా నిర్మించబడుతున్న ఆంజనేయ స్వామి దేవస్థాన ప్రతిష్టాపన విగ్రహ దర్శన కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ డోర్నకల్ శాసనసభ్యులు డాక్టర్ రామచంద్రు నాయక్ మరియు మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థి పోరిక బలరాం నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా లాకావత్ ధనావతి జన్మదిన వేడుకలు

**ఆరోగ్య కేంద్రాలలో పండ్లు పంపిణీ**

**బయ్యారం, విశాలభారతి :** గంధంపల్లి గ్రామంలో ఉమ్మడి వరంగల్ జిల్లా మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ లాకావత్ ధనావతి జన్మదిన సందర్భంగా ఎల్ హెచ్ పి ఎస్ ఏక్ మాత్రో వ్యవస్థాపక అధ్యక్షులు వాంకడోత్ మంగీలాల్ ఆధ్వర్యంలో మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించి, అనంతరం గంధంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పండ్లు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భూక్య పవన్, కుమార్, అర్జున్, మహేష్,



సంతోష్, సురేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీకి చరమగీతం పాడాలి





**తొర్రూరు, విశాలభారతి:** రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి చరమగీతం పాడాలని కాంగ్రెస్ వరంగల్ లోక్ సభ ఎన్నికల ఇన్చార్జ్, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి పిలుపునిచ్చారు. తొర్రూరు డివిజన్ కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో లోక్సభ ఎన్నికలపై కాంగ్రెస్ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జి ఝాన్సీ రెడ్డి లతో కలిసి రేవూరి మాట్లాడారు.ఈ ఎన్నికల్లో కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేసేందుకు పార్టీ కార్యకర్తలు, నాయకులు కష్టపడాలని కోరారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కులాలను, మతాలను రెచ్చగొట్టి. రామ మందిరం పేరుతో రెండుసార్లు అధికారం చేపట్టిందని మండిపడ్డారు. అలాంటి బీజేపీని గద్దె దించాల్సిందేనని ఉద్ఘాటించారు. తెలంగాణ రాష్ట్రంలో తమ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీ పథకాల్లో ఇప్పటికే ఐదింటిని తమ ప్రభుత్వం అమలు చేసిందని పేర్కొన్నారు. ఈ పథకాలపై నేతలు విస్తృత ప్రచారం చేయాలని కోరారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా మార్చిందన్నారు. నేతలపై ఫోన్ టాపింగ్ సైతం పెట్టి ఇబ్బందులకు గురి చేసినా రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం వచ్చిందన్నారు. ఫోన్ టాపింగ్ చేసిన నేతలపై రాబోయే రోజుల్లో చట్టపరమైన చర్యలు తప్పకుండా ఉంటాయని చెప్పారు. ప్రాజెక్టుల పేరుతో లక్షల కోట్లు దోచుకున్నారని, నీటిని స్టోరేజీ చేయటంలో విఫలమయ్యారని ఆరోపించారు. వేసవి కాలంలో నీటి సమస్యను తెరమీదకు తెచ్చి ప్రజల వద్దకు వచ్చే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. అయితే.. ఇప్పుడు వారి మాటల్ని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు.
పార్లమెంట్ ఎన్నికల్లో 14 ఎంపీ స్థానాలు గెలిచి చూపుతామని తెలిపారు. వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి కడియం కావ్యను అధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.ఈ సమావేశంలో మాజీ టీపీసీసీ సభ్యులు కేతిరెడ్డి నిరంజన్ రెడ్డి, ముత్తినేని సోమేశ్వరరావు,పిఎసిఎస్ చైర్మన్ కాకిరాల హరిప్రసాద్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు హమ్యా నాయక్, రాపాక సత్యనారాయణ,కాంగ్రెస్ పార్టీ మండలాల అధ్యక్షులు సుంచు సంతోష్, గిరగాని కుమారస్వామి, నల్లాల శ్రీరాములు, ముద్దసాని సురేష్, ధరావత్ సురేష్ నాయక్, రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# సాదులకు జీతభత్యాలు కల్పించాలి

**మాలు సాదు ఆవేదన.**

**కురవి, విశాలభారతి:** మిబంచరాయితండ గ్రామ పంచాయతీలో శ్రీ బుడియా బాపు మహాపూజ భోగ్ బండారో కార్యక్రమం నిర్వహించి వేలది మంది భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆంజనేయ స్వామి, సేవలాల్ మహారాజ్, మేరమ అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని పాడి పంటలు అష్టైశ్వర్యాలు ఆయురారోగ్యాలతో గ్రామ ప్రజలు సురక్షితంగా ఉండాలని కోరారు. ఈ సందర్భంగా జరుపల మాలు సాదు మాట్లాడుతూ... శ్రీ బుడియా బాపు అంటే మా బంజారాలకు ఆరాధ్య దేవుడు. ఆ రోజుల్లో గుడియా బాపు చిన్న వయసులో నలగొండ డిస్టిక్ తిరుమలగిరి రంగుల అనే ఊరిలో జన్మించారు. బుడియా బాపు అసలు పేరు సేవియా సాద్ బుడియా బాపు ఆ స్వామి చిన్నపుడు గోవులు కాస్తుండగా తిరుమల తిరుపతి బాలాజీ ఒక స్వామి రూపంలో బుడియా బాపు తో పాచికలు ఆడ్యారు. శ్రీ బుడియా బాపు కి భోగ్ బండారో అంటే చాలా ఇష్టం ఈ పూజ బంజారా వాసులు అతి పెద్ద పండుగ భావిస్తారు అని అన్నారు. ఈ సందర్భంగా గుడి పూజారులకు దీప దూప నైవేద్యం కు గవర్నమెంట్ నిదులు కేటాయించాలని నేల నేల జీతభత్యాలు కల్పించాలని వాళ్లు డిమాండ్ చేశారు. అదేవిధంగా దేవునికి నిత్య అర్చన నిధులు కేటాయించాలని వాళ్లు కోరారు. ఈ కార్యక్రమంలో సాదుల సంఘం జిల్లా అధ్యక్షుడు అంగోత్ రాజు సాద్, బిచ్చ సాద్, నాగు, తేజ్యా నాయక్ కిషన్, లీంగు, బాలు, గోపా తదితరులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం

**గరిడేపల్లి, విశాలభారతి:** మండల కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం మండల కేంద్రంలోని పైడిమర్రి ఫంక్షన్ హాల్ లో నిర్వహించడం జరిగింది. శనివారం రోజు జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర పౌరసరఫరాల, భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి హాజరైనారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రేపు జరిగే హుజూర్నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశానికి మండలంలోని 57 పోలింగ్ బూత్ల నుండి భారీ సంఖ్యలో కాంగ్రెస్ కార్యకర్తలు హాజరు కావాలని కోరినాడు. భారతదేశం కాంగ్రెస్ పార్టీ సభ్యత్వాలలోనే అత్యధికంగా 4.5లక్షల సభ్యత్వాలు హుజూర్నగర్ నియోజకవర్గం నుండి చేయించడం జరిగిందని అన్నారు. అదేవిధంగా హుజూర్నగర్ నియోజకవర్గం తన హయాంలోనే అభివృద్ధి జరిగిందని, డిసెంబర్ 15న తాను మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన రోజు నుండి ఇప్పటివరకు హుజూర్నగర్ లో 2000 గృహాలకు 70 కోట్లు ఆర్ అండ్ బీ రోడ్లు పంచాయతీరాజ్ రోడ్లకు 60 కోట్లు నియోజకవర్గంలో ఎన్ ఆర్ జి నిధుల కింద 15 కోట్లు నక్కగూడెం లిఫ్ట్ ఇరిగేషన్ కు 6 కోట్లు వెచ్చించి అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయడం జరిగిందని అన్నారు. పార్లమెంటు ఎన్నికల ఫలితాల అనంతరం ప్రతి గ్రామంలో రేషన్ కార్డులు ఇందిరమ్మ ఇండ్ల లాంటి పథకాల కోసం కృషి చేస్తానని అన్నారు.



# విద్యార్థినులకు కంటి పరీక్షలు

**నేత్ర వైద్య సహాయకులు జీ.సంజీవ రావు**

**మణుగూరు, విశాలభారతి :** పినపాక,మణుగూరు, అశ్వాపురం మండలాల పరిధిలోని ప్రభుత్వ ఎస్సీ ఎస్టీ బిసి హాస్టల్ లో చదువువుతున్న విద్యార్థిని, విద్యార్థులకు శనివారం తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజ్ లో విద్యార్థి విద్యార్థినులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించడం జరిగిందని నేత్ర వైద్య సహాయకులు జి సంజీవరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి వరకు 1974 మంది విద్యార్థినులకు కంటివైద్య పరీక్షలు నిర్వహించామని, ఏప్రిల్ మాసంలో ఎనిమిదో తారీకు నుండి రాష్ట్రమంతటా హాస్టల్ విద్యార్థినిలకు కంటి వైద్య శిబిరాలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఈ నేపథ్యంలో మణుగూరు డివిజన్ స్థాయిలో ఉన్న హాస్టల్ విద్యార్థులకు నేటి వరకు 19 74 మంది విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించడం జరిగిందని, ఇందులో 63 మంది విద్యార్థినులకు కంటి చూపు తక్కువగా ఉండడంతో కళ్ళజోళ్ళు అవసరంగా నిర్ధారించడం జరిగిందని అన్నారు. వైద్య శిబిరంలో డాక్టర్ గోపిలాల్ నేత్ర వైద్యాధికారి జి. సంజీవ రావు, ప్రిన్సిపల్ పద్మావతి, స్టాఫ్ నర్స్ సంపూర్ణ, ఆర్బీఎస్కె సిబ్బంది సరస్వతి, పుష్ప తదితరులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ప్రతిభ అద్భుతం

**ఎంఈఓ చత్రు నాయక్**

**నేరేడుచర్ల , విశాలభారతి:** ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ప్రతిభ అద్భుతమని ఎంఈఓ చత్రు నాయక్ అన్నారు. శుక్రవారం వెలువడిన గురుకుల 5వ తరగతి ప్రవేశ పరీక్ష ఫలితాలలో నేరేడుచర్ల మండలం పులగం బండ తండ గ్రామానికి చెందిన ప్రభుత్వ పాఠశాల ఆరుగురు విద్యార్థులు విజయకేతనం ఎగరవేశారు.ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయులు పి శ్రీధర్ శిక్షణలో భాగంగా ఆరుగురు విద్యార్థులు గురుకుల సీట్లు సాధించడం ఎంతో గర్వకారణమన్నారు.గ్రామానికి గుర్తింపు తీసుకొచ్చిన ప్రధానోపాధ్యాయులను విద్యార్థులను అభినందించారు.ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని భవిష్యత్తులో ఉన్నత చదువు చదివి ఉన్నత శిఖరాలు అవరోధించాలని కోరారు. ఎంపికైన విద్యార్థులు బానోతు సిద్ధార్థ, హర్షవర్ధన్, సందీప్, అలేఖ్య, సింధు, ధీరావత్ నర్మద ల పట్ల హర్షం వ్యక్తం చేసిన ఉపాధ్యాయులు,గ్రామస్తులు .ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు బంటు మధు,కార్యదర్శి ఇంజమూరి వెంకట్ అంగన్వాడి టీచర్ సైదమ్మ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# మోడీతోనే భారత సమగ్రాభివృద్ధి

**తొర్రూరు, విశాలభారతి:** నరేంద్ర మోడీ తోనే భారత దేశ సమగ్రాభివృద్ధి సాధ్యం అవుతుంది అని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లేగా రాం మోహన్ రెడ్డి తెలిపారు. తొర్రూరులో స్థానిక పార్టీ కార్యాలయంలో బీజేపీ తొర్రూరు రూరల్ మండలం అధ్యక్షుడు బొచ్చు సురేష్ ఆద్వర్యంలో మండలంలోని చింతలపల్లి,హచ్చు తండాకు చెందిన.సుమారు వంద మంది పార్టీ లో చేరారు. బీజేపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లేగా రాం మోహన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా లేగా రాం మోహన్ రెడ్డి మాట్లాడుతూ ప్రదాని నరేంద్ర మోడీ గారి నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం గత పదేళ్ల నిర్విరామ కృషి, అంకితభావం,పట్టుదల కారణంగా ధేశం వికసిత్ భారత్ దిశగా గొప్ప ముందడుగు వేసింది అని తెలిపారు.సబ్ కా సాత్ సభ్ కా వికాస్ నినాదం అక్షరాలా ఆచరణలో చూపెడుతున్న మోదీ భారతీయులందరి జీవితాల్లో మార్పు తీసుకొచ్చారు అని, పదేళ్ల క్రితం వరకు కాంగ్రెస్ పాలనలో సర్వం అవినీతిమయం అన్న అపప్రదను మూటగట్టుకున్న దేశాన్ని నేడు అవినీతి రహితంగా మార్చిన ఘనత నరేంద్ర మోడీ దే అని తెలిపారు. రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ మరోసారి అఖండ విజయం సాధించడం ఖాయమని, ముచ్చటగా మూడోసారి నరేంద్ర మోడీ గారు ప్రధాని కావడం ఖాయమని తెలిపారు.ధేశంలో ఎక్కడ చూసినా మోడీ బీజేపీ హవా కొనసాగుతోంది అని వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి అరూరి రమేష్ గారిని అత్యధిక మెజారిటీతో గెలిపించి ప్రదాని నరేంద్ర మోడీ గారి కి కానుకగా అందిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో బిజెపి పాలకుర్తి నియోజకవర్గ కన్వీనర్ పూసాల శ్రీమాన్, జనగామ జిల్లా ప్రధాన కార్యదర్శి,రూరల్ మండలం ఇంచార్జీ కర్ర శ్రీనివాస్ రెడ్డి, తొర్రూరు శాఖ అధ్యక్షుడు పల్లె కుమార్, జిల్లా నాయకులు రచ్చ కుమార్, యాకయ్య, తదితరులు పార్టీ లో చేరారు.

# వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించాలి



**మోతె, విశాలభారతి :** ఐకెపి కార్మికులు వడ దెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించాలని పి హెచ్ యన్ సీతా అన్నారు శనివారం మండల పరిధిలోని బల్లు తండా గ్రామంలో ఐ కె పి కేంద్రం వద్ద పనులు చేస్తున్న కార్మికుల కు అవగాహన కల్పించి సలహాలు సూచనలు చేశారు ఈ వేసవి లో విపరీతంగా ఎండలు పెరిగి వడ దెబ్బ బారిన పడుతున్నారని ఉదయం పది గంటల లోపు సాయంత్రం నాలుగు గంటల తరువాత పనులు చేయాలని తరుచుగా నీటిని త్రాగాలని మజ్జిగ నిమ్మరసం త్రాగాలని అత్య అవసరం అయితే తేలిక పాటి వస్త్రాలు ధరించి గొడుగు వేసుకొని వెళ్లాలని రోడ్ల పై దొరికే ఎలాంటి పానీయాలు తీసుకోరాదని చెప్పారు ప్రతి గ్రామం లో గ్రామ పంచాయితీ కార్యదర్శి ఫీల్డ్ అసిస్టెంట్లు ఆశ కార్యకర్త రేషన్ డీలర్ల వద్ద ఓ అర్ యస్ ప్యాకిట్లు అందుబాటులో ఉంటాయని ప్రతి ఒక్కరు వాటిని ఉపయోగించు కోవాలని కోరారు ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ కమలమ్మ ఏ యన్ యం జయసుధ రమాదేవి ఆశలు తదితరులు పాల్గొన్నారు .



# మోడీనీ చూసి ఓటు వేయాలి

**నియోజవర్గ వాణిజ్య సెల్ కన్వీనర్ వంగ వేటి శ్రీనివాస రావు**

**మోతె, విశాలభారతి** : మోడీ నీ చూసి ఓటు వేయాలని కోదాడ నియోజక వర్గం వాణిజ్య సెల్ కన్వీనర్ వంగ వేటి శ్రీనివాస రావు అన్నారు శనివారం మండల కేంద్రం లో పార్లమెంట్ ఎన్నికల ప్రచారం లో బాగంగా పలు గ్రామాల లో బి జె పి అభ్యర్థి శానంపుడి సైదిరెడ్డి గెలుపు కోసం ఇంటింట ప్రచారం నిర్వహించారు అనంతరం ఆయన మాట్లాడుతూ పది సంవత్సరాలుగా కేంద్ర ప్రభుత్వం ప్రజల అభివృద్ధికి అనేక సంక్షేమ పథకాలను అమలు చేసిందని ప్రతి ఒక్కరు బి జె పి కి ఓటు వేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు బానోతు శ్రీను ,బూతు అధ్యక్షులు కొత్త ధర్మా ,అప్పల, బొంత, పూర్ణా చారి,శివ తదితరులు పాల్గొన్నారు.

# ఓబీసీ మోర్చా నియామక పత్రాన్ని అందుకున్న రజనీకాంత్ గౌడ్



**మరిపెడ, విశాలభారతి:** ఎర్జర్ల గ్రామానికి చెందిన సొంటి రజనీకాంత్ గౌడ్, ఓబీసీ మోర్చా నియామక పత్రాన్ని బిజెపి పార్లమెంటు అభ్యర్థి సీతారాం నాయక్. చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. అనంతరం సొంటి రజనీకాంత్ గౌడ్ మాట్లాడుతూ నా నియమకానికి సహకరించిన సీతారాం నాయక్ కు అభినందనలు తెలుపుతూ పార్టీ నియమ నిబంధనలకు కట్టుబడి ఉంటూ, ప్రతి గ్రామంలో బిజెపి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ప్రతి గ్రామపంచాయతీలలో ఓబీసీ మోర్చా అధ్యక్షులను నియమిస్తూ నరేంద్ర మోడీ ప్రవేశ పెడుతున్న పథకాలను ప్రతి కార్యకర్తకు చేరే విధంగా కృషి చేస్తానని అన్నారు, మహబూబాద్ గడ్డమీద కమలం పువ్వు ఎగురుతుందని ధీమా వ్యక్తం చేశారు.



# అధిక ఉష్ణోగ్రతలు.. పని వేళలు మార్చాలి

**జి. ఎం శ్యాంసుందర్ కి వినతి పత్రం అందజేత**

**మణుగూరు, విశాలభారతి :** కాంట్రాక్ట్ కార్మికులు ప్రతి సంవత్సరం మే నెలలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు అయితే ఈ సంవత్సరం ఏప్రియల్ నెలలోనే ఎండలు దంచి కొడుతున్నాయని దయచేసి యాజమాన్యం స్పందించి పని వేళలు మార్చాలని కోరుతూ సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఐ ఎఫ్ టి యు ఆధ్వర్యంలో కాంట్రాక్ట్ కార్మికులు శనివారం ఏరియా ఎస్ ఓ టు జిఎం బి శ్యాంసుందర్ కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఐ ఎఫ్ టి యు జిల్లా నాయకులు మిడిదొడ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో పారిశుధ్యం రోడ్స్ క్లీనింగ్, ఉద్యానవనాల కాంటాక్ట్ కార్మికుల పని వేళలు మార్చాలని యాజమాన్యం సానుకూలంగా స్పందించాలని కోరారు, అదేవిధంగా ప్రైవేట్ సెక్యూరిటీ గార్డుల నియామకంలో నిర్వాసితులకు మరియు ఉపాధి కోల్పోయిన వార్డు బాయ్ లకు న్యాయం చేయాలి కాంట్రాక్టర్ల అవినీతిపై విచారణ జరిపించి నిర్వాసితులకు పరుగు పందెంలో అర్హత సాధించిన నిరుద్యోగులకు న్యాయం చేయాలన్నారు. ప్రవేట్ సెక్యూరిటీ గార్డులు అందరికీ ఖాకీ యూనిఫామ్ ఇవ్వాలి.విధి నిర్వహణలో చనిపోయిన ఇల్లందు ప్రైవేట్ కన్వీనెన్స్ వెహికల్ డ్రైవర్ కంపా ప్రసాద్ కుటుంబానికి భీమా మరియు ఎక్స్ గ్రేషియా చెల్లించి కుటుంబాన్ని ఆదుకోవాలి,కాంటాక్ట్ కార్మికులందరికీ వాహన డ్రైవర్లకు పర్మినెంట్ కార్మికులకు ఇచ్చినట్లుగా ఓఆర్ఎస్ మరియు మజ్జిగ ప్యాకెట్లు అందజేయాలి అని తెలిపారు. 2024 మార్చి 31 వరకు అన్ని విభాగాల కాంట్రాక్ట్ కార్మికుల సి ఎం పి ఎఫ్ జమ వివరాలతో కూడిన పాస్ బుక్ లు ఇవ్వాలనీ వారన్నారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్ట్ కార్మికులు కే గురుమూర్తి, కే నాగేశ్వరరావు, ఎం వెంకటేశ్వర్లు, శివరామకృష్ణ, జె సత్యవతి కే రమణ, సిహెచ్ నాగమణి, కే రమాదేవి, వి అనసూయ తదితరులు పాల్గొన్నారు.



# అంగన్వాడి విద్యార్థుల గ్రాడ్యుయేషన్ దినోత్సవం

**తుంగతుర్తి, విశాలభారతి:** మండల కేంద్రంలోని గానుగుబండ గ్రామ అంగన్వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలను శ్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంగన్వాడీ టీచర్ శోభ శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్వైజర్ ప్రమీల ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ పిల్లలు జీవితంలో మొదటి ఆరు సంవత్సరాలు చాలా కీలక దశ అని ఈ దశలో పిల్లలకు అందించే ప్రేరణ అనుభవాలు వారి భవిష్యత్తుకు సంపూర్ణ అభివృద్ధికి వ్యక్తిత్వ వికాసానికి పునాది వేస్తుందని పేర్కొన్నారు. పూర్వ ప్రాథమిక విద్యా ప్రాముఖ్యత పౌష్టికాహారం ప్రాధాన్యత గూర్చి తల్లులకు, చిన్నారులకు అవగాహన కల్పించారు. అంగన్వాడీలు వాటి పాత్ర పిల్లలలో భాషా,సామాజిక భావోద్వేగా మరియు సృజనాత్మకత పరంగా పిల్లల సమగ్ర అభివృద్ధికి పునాది వేయడం జరుగుతుందని పోషకాహార లోపానికి వ్యతిరేకంగా పిల్లల మరణాల రేటు మరియు పాఠశాల డ్రాప్ అవుట్ పిల్లలను తగ్గించడంలో ప్రముఖ పాత్ర పోషిస్తాయని చెప్పారు .అనంతరం అంగన్వాడీ టీచర్ పిల్లల బరువులు తూకం వేయడం ,పిల్లల ప్రోగ్రెస్ రిపోర్టులను పంపిణీ చేయడం జరిగింది. త్రీ ప్లస్, ఫోర్ ప్లస్ పిల్లలకు అభివృద్ధి మైలురాళ్లు అనగా పిల్లల మానసిక కండరాల అభివృద్ధి మేధో వికాసం పిల్లలు ఎదుగుదల చూస్తూ పిల్లల ఆటపాటలతో ప్రీ స్కూల్ విద్యను అసెస్మెంట్ కార్డులో ఇచ్చారు .ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ జి శోభ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు శ్యాంసుందర్ ,సరిత ,ఫిరోజ్ బేగం ఆయా మణెమ్మ ,ప్రమీల తల్లి దండ్రులు ఉష ,నవ్య ,గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



# గ్రామాల్లో బెల్ట్ షాపుల జోరు

**అధిక ధరలతో మద్యం ప్రియుల జేబులు ఖాళీ**

**ఎమ్మార్పీ ధర కంటే అదనంగా బాదుడు**

**జాడ లేని ఎక్సైజ్ అధికారులు**


**అశ్వాపురం, విశాలభారతి :** మండలంలో వివిధ గ్రామాలలో బెల్ట్ షాపుల దందా జోరుగా కొనసాగుతోంది. అధిక ధరలకు బెల్ట్ షాపుల యజమానులు గల్లా నింపుకునేందుకు నిబంధనలకు విరుద్ధంగా మద్య అమ్మకాలు జరుపుతున్నారు. గ్రామాలలో ఎటువంటి అనుమతులు లేకుండా ఏర్పాటు చేసుకున్న బెట్ల షాపులు తెల్లవారుజామున నుంచే అర్ధరాత్రి వరకు సమయం ఎంతైనా మద్యం దొరుకును అనే తరహాలో అందుబాటులో ఉంటున్నాయి. పగలు రాత్రి అనే తేడా లేకుండా బెల్ట్ షాపుల యజమానుదారులు స్థానికంగా ఉన్న వైన్స్ దుకాణాల నుండి కొనుగోలు చేసి మద్యాన్ని అధిక ధరలకు అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారు. బెల్ట్ షాపుల్లో మద్యం అమ్మకాలు మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతున్నాయి. ఇళ్ల మధ్యలో పలువురు ఇళ్లలోనే మద్యం బాటిల్లను దాచి అవసరమైన వారికి ఒక్కొక్కటిగా తీసుకువచ్చిస్తున్నారు. పలు కిరాణా దుకాణాలలో ప్రజలకు అవసరమైన నిత్యావసర సరుకులు అమ్ముతూ కిరాణా షాప్ ముసుగు లో మద్యం సీసాలు అమ్ముతున్నారు. రాత్రి పగలు తేడా లేకుండా మద్య లభించడంతో వినియోగదారులు జేబులు ఖాళీ చేసుకుని అనారోగ్యం భారీన పడుతున్నారు. వారి కుటుంబాలకు భారమవుతున్నారు. బెల్ట్ షాపుల నిర్వాహకులు ఇళ్ల మధ్యలో విక్రయిస్తుండడంతో మద్యం సేవించిన వారు దారిలో వస్తున్న యువకులు మహిళలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బెల్ట్ షాపులను అరికట్టాలని స్థానిక ప్రజలు, మహిళా సంఘాల నాయకులు, పలువురు మహిళలు కోరుతున్నారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక

సినిమా
www.vishalabharati.com
epaper:vishalabharati.com

vishalabharathi Telugu Daily







1999 లో సింగరేణి లో జరిగిన ఓ యధార్థ సంఘటన ఆధారంగా "సింగరేణి జంగ్ సైరెన్" అనే పేరుతో ఒక సర్వైవల్ డ్రామా తెరకెక్కబోతుంది. జార్జ్ రెడ్డి సినిమా దర్శకుడు జీవన్ రెడ్డి ఈ సినిమా కు కథను రూపొందించగా ...వివేక్ ఇనుగుర్తి ని నూతన దర్శకుడిగా పరిచయం చేస్తున్నాడు. "ధూమ్ర వారాహి" అనే నూతన ప్రొడక్షన్ హౌస్ లో ఈ సినిమా నిర్మాణం జరుగుతుంది. ఇప్పటికే ప్రీ ప్రొడక్షన్ పనులు పూర్తి చేసుకొని , త్వరలోనే సెట్స్ పైకి వెళ్లనుంది. ఆర్టిస్ట్ లు , తదితర వివరాలు మే డే రోజు ప్రకటించబోతున్నారు. "జార్జ్ రెడ్డి" ఫేం డైరెక్టర్ జీవన్ రెడ్డి అందించిన కథతో యదార్థ ఘటనల నేపథ్యంగా తెరకెక్కనున్న "సింగరేణి జంగ్ సైరెన్" మూవీ జార్జ్ రెడ్డి సినిమా ఫేం డైరెక్టర్ జీవన్ రెడ్డి రాసిన కథతో తెరకెక్కనున్న కొత్త సినిమా "సింగరేణి జంగ్ సైరెన్". ది అండర్ గ్రౌండ్ లైవ్స్ అనేది ట్యాగ్ లైన్. ఈ చిత్రాన్ని ధూమ్ర వారాహి బ్యానర్ పై నూతన దర్శకుడు వివేక్ ఇనుగుర్తి రూపొందించనున్నారు. 1999 లో సింగరేణిలో జరిగిన ఓ యధార్థ సంఘటన ఆధారంగా ఈ సినిమా తెరకెక్కనుంది. ఈ సర్వైవల్ డ్రామా మూవీకి సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ పనులు పూర్తయ్యాయి. త్వరలోనే "సింగరేణి జంగ్ సైరెన్" సినిమా సెట్స్ మీదకు వెళ్లనుంది. ఈ సినిమా నటీనటులు, ఇతర వివరాలు ప్రపంచ కార్మిక దినోత్సవం అయిన మేడే రోజున ప్రకటించనున్నారు. తెలంగాణ నేపథ్య సినిమాలు మంచి ఆదరణ పొందుతున్న ఈ టైమ్ లో పక్కా తెలంగాణ నేటివ్ మూవీగా "సింగరేణి జంగ్ సైరెన్" సినిమాను పిక్చరైజ్ చేయనున్నారు.

# భజే వాయు వేగం టీజర్ లాంఛ్ చేసిన మెగాస్టార్

ప్రతిష్ఠాత్మక నిర్మాణ సంస్థ యూవీ క్రియేషన్స్ సమర్పణలో యూవీ కాన్సెప్ట్స్ బ్యానర్ మీద హీరో కార్తికేయ గుమ్మకొండ నటిస్తున్న "భజే వాయు వేగం" సినిమా టీజర్ ను మెగాస్టార్ చిరంజీవి గారు రిలీజ్ చేశారు. విశ్వంభర సినిమా సెట్ లో ఈ టీజర్ రిలీజ్ చేసిన మెగాస్టార్ టీజర్ తో పాటు టైటిల్ ఇంట్రెస్టింగ్ గా, ఇంప్రెసివ్ గా ఉందని చెప్పారు. తన అభిమాని, తమ్ముడు లాంటి కార్తికేయ హీరోగా నటించిన "భజే వాయు వేగం" సినిమా విజయం సాధించాలని మెగాస్టార్ తన బెస్ట్ విశెస్ అందించారు. "భజే వాయు వేగం"చిత్రంలో ఐశ్వర్య మీనన్ హీరోయిన్ గా నటిస్తోంది. హ్యాపీ డేస్ ఫేమ్ రాహుల్ టైసన్ కీలక పాత్రను పోషిస్తున్నాడు. ఈ సినిమాకు ప్రశాంత్ రెడ్డి చంద్రపు దర్శకత్వం వహిస్తున్నారు. అజయ్ కుమార్ రాజు.పి. కో ప్రొడ్యూసర్ గా వ్యవహరిస్తున్నారు. ఈ సినిమా టీజర్ విడుదల సందర్భంగా మెగాస్టార్ చిరంజీవి గారు మాట్లాడుతూ - యూవీ కాన్సెప్ట్స్ లో విక్కీ నిర్మాతగా, దర్శకుడు ప్రశాంత్ రెడ్డి చంద్రపు రూపొందిస్తున్న "భజే వాయు వేగం" సినిమా టీజర్, టైటిల్ ఆసక్తికరంగా, ఆకట్టుకునేలా ఉన్నాయి. నా అభిమాని, తమ్ముడు లాంటి కార్తికేయ హీరోగా నటిస్తున్న సినిమా ఇది. నా అభిమాని హీరోగా ఓ మంచి సినిమాలో నటిస్తున్నాడంటే ఆ సినిమా బాగుండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటాను. ప్రశాంత్ రెడ్డి లాంటి యంగ్ టాలెంటెడ్ డైరెక్టర్స్ టాలీవుడ్ కు రావాలి. ఇలాంటి యంగ్ డైరెక్టర్స్ ఎంతమంది కొత్త కాన్సెప్ట్స్ తో వస్తే అంత ఫ్రెష్ గా మన ఫిలిం ఇండస్ట్రీ ముందుకు సాగుతుంది. యంగ్ డైరెక్టర్స్ ను నేను ఎప్పుడూ ఆహ్వానిస్తుంటాను. "భజే వాయు వేగం" సినిమా టీజర్ చూస్తుంటే తండ్రీ కొడుకు మధ్య మంచి ఎమోషన్ తో సాగే సినిమా అనిపిస్తోంది. యాక్షన్ బాగుంది. ఈ సినిమా స్టోరీ నాకు తెలిసినా ఇంతకంటే ఎక్కువ లీక్ చేయాలనుకోవడం లేదు. "భజే వాయు వేగం" సినిమా టీమ్ కు ఆల్ ది బెస్ట్ చెబుతున్నా. అని అన్నారు..



# 'ప్రతినిధి 2' గ్రిప్పింగ్ ట్రైలర్



నారా రోహిత్ సినిమాల్లోకి కమ్ బ్యాక్ ఇస్తూ, జర్నలిస్ట్ మూర్తి దేవగుప్తాపు దర్శకుడిగా అరంగేట్రం చేస్తున్న చిత్రం ప్రతినిధి 2. ఈ సినిమా ఇంటెన్స్ టీజర్ అందరి దృష్టిని ఆకర్షించింది. ఈరోజు ఈ సినిమా థియేట్రికల్ ట్రైలర్‌ను మేకర్స్ విడుదల చేశారు. స్టార్ డైరెక్టర్ సుకుమార్ ట్రైలర్ ని లాంచ్ చేశారు. జనవరి 30, 1948న స్వాతంత్ర్య సమరయోధుడు మహాత్మా గాంధీ మరణించిన తర్వాత గుండెపోటుతో ఎంత మంది మరణించారు అని జర్నలిస్ట్ పాత్ర పోషించిన నారా రోహిత్ అడగడంతో ట్రైలర్ ప్రారంభమవుతుంది. ప్రస్తుతానికి వస్తే.. ఒక ముఖ్యమంత్రి మరణించిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా హింసాత్మక నిరసనలు జరుగుతాయి. ఆత్మహత్యాయత్నం చేసుకొని ఆసుపత్రిలో చేరిన వ్యక్తిని "మీ కుటుంబం కంటే నాలుగు సంక్షేమ పథకాలు ఇచ్చిన రాజకీయ నాయకుడు ముఖ్యమా? అని కథానాయకుడు ప్రశ్నిస్తాడు. ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నప్పటికీ వచ్చే ఎన్నికల్లో తమ గెలుపుపై అధికార పార్టీకి అనుమానాలు వుంటాయి. మరోవైపు, ఓ ఛానెల్‌లో ప్రత్యేకంగా వార్తలు ప్రసారం చేస్తున్న కథానాయకుడిని పోలీసులు అనుమానిస్తున్నారు. అతను ఎవరు? అతని ఎజెండా ఏమిటి? వచ్చే ఎన్నికల్లో ఓట్లు వేసే విషయంలో ఓటర్లను ఎందుకు హెచ్చరించాడు? ఇలాంటి ఎలిమెంట్స్ ఎక్సయిటింగ్ ప్రజెంట్ చేశారు. రాజకీయ వ్యవస్థలోని అవినీతిని ప్రశ్నిస్తూ మూర్తి దేవగుప్తపు ఒక పవర్ ఫుల్ కథను రాశారు. కథానాయకుడి అసలు పాత్రను వెల్లడించకుండా ట్రైలర్‌లో సినిమా గురించి మరింత సమాచారం ఉంది. నారా రోహిత్ అద్భుతమైన నటనతో ఆకట్టుకున్నారు. సిరీ లెల్లా కథానాయికగా నటించింది. సచిన్ ఖేడేకర్, దినేష్ తేజ్, రఘుబాబు, జిషు సేన్‌గుప్తా, ఉదయ భాను, అజయ్ ఘోష్ , శ్రీ ముఖ్య పాత్రల్లో కనిపించారు.

# మే3న బాక్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్



అత్యంత విజయవంతమైన హారర్ కామెడీ సిరీస్ 'అరణ్మనై' నుంచి నాల్గవ చిత్రం అరణ్మనై 4 తెలుగులో 'బాక్' పేరుతో వస్తోంది. సుందర్ సి దర్శకత్వంతో పాటు ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ చిత్రంలో తమన్నా భాటియా, రాశి ఖన్నా హీరోయిన్స్. ఈ చిత్రాన్ని ఏప్రిల్ 26న విడుదల చేయడానికి తొలుత సన్నాహాలు చేశారు మేకర్స్. అయితే ఎండల తీవ్రత అధికంగా వుండటం వలన విడుదల తేదిని వాయిదా వేస్తూ కొత్త తేదిని తెలియజేశారు. మే 3న ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా విడుదల చేస్తున్నట్లు అనౌన్స్ చేశారు మేకర్స్. ఇప్పటికే ఈ చిత్రం నుంచి విడుదలైన 'పంచుకో' పాట అద్భుతమైన రెస్పాన్స్ తో చార్ట్ బస్టర్ హిట్ అయ్యింది. త్వరలోనే ట్రైలర్ ని విడుదల చేసి తెలుగు ప్రమోషన్స్ ని దూకుడుగా చేయబోతున్నారు మేకర్స్.

అవ్నీ సినిమాక్స్ P LTD పతాకంపై ఖుష్బు సుందర్, ACS అరుణ్ కుమార్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో వెన్నెల కిషోర్, శ్రీనివాసులు, ఢిల్లీ గణేష్, కోవై సరళ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఏషియన్ సురేష్ ఎంటర్‌టైన్‌మెంట్ LLP తెలుగు రాష్ట్రాల్లో ఈ చిత్రాన్ని విడుదల చేయనుంది.



# 'డార్లింగ్'.. హనుమాన్ అంతటి పెద్ద విజయాన్ని సాధించాలని కోరుకుంటున్నాను

## క్రియేటివ్ డైరెక్టర్ ప్రశాంత్ వర్మ

పాన్ ఇండియా సెన్సేషనల్ బ్లాక్‌బస్టర్ హను-మాన్‌ని అందించిన ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్ నిర్మాత నిరంజన్ రెడ్డి, శ్రీమతి చైతన్య సమర్పణలో తన తదుపరి సినిమాని అనౌన్స్ చేశారు . బలగం, ఓం భీమ్ బుష్, సేవ్ ది టైగర్స్ సిరీస్‌ల విజయాలతో దూసుకుపోతున్న ప్రియదర్శి ఈ చిత్రంలో హీరోగా నటిస్తున్నారు. నభా నటేష్ హీరోయిన్. రొమ్-కామ్ ఎంటర్ టైనర్ గా రూపొందుతున్న ఈ చిత్రానికి అశ్విన్ రామ్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రానికి 'డార్లింగ్' అనే టైటిల్‌ను మేకర్స్ అనౌన్స్ చేశారు. 'వై దిస్ కొలవెరి' అనే ఆసక్తికరమైన ట్యాగ్‌లైన్ పెట్టారు. నభా నటేష్‌తో ప్రియదర్శి పెళ్లి ప్రపోజల్‌ని చూపించే ఫస్ట్‌లుక్ పోస్టర్ టైటిల్‌లాగే ఆహ్లాదకరంగా ఉంది. టైటిల్ అనౌన్స్మెంట్ గ్లింప్స్ ప్రియదర్శి , నభా నటేష్ మధ్య రిలేషన్ ని చూపుతుంది. ఇది పూర్తిగా హిలేరియస్ గా ఉంది. జనాదరణ పొందిన పాటల ద్వారా అమ్మాయిల మానసిక స్థితిని వర్ణించే టైటిల్ గ్లింప్స్ ఆలోచన దర్శకుడు అశ్విన్ రామ్ క్రియేటివిటీని చూపుతుంది. హనుమాన్ నిర్మాతల నుంచి వస్తోన్న ఈ సినిమాపై అంచనాలు భారీగానే ఉన్నాయి. టైటిల్ లాంచ్ ఈవెంట్ లో ముఖ్య అతిథిగా పాల్గొన్న దర్శకుడు ప్రశాంత్ వర్మ మాట్లాడుతూ.. దర్శితో నాకు ప్రత్యేకమైన అనుబంధం వుంది. దర్శకుడిగా నా తొలి షాట్ దర్శి మీదే పెట్టాను. దర్శిని నా మొదటి హీరో. ఈ వేడుకు అతిథిగా రావడం ఆనందంగా వుంది. నిరంజన్ గారితో మూడేళ్ళుగా జర్నీ చేస్తున్నాం. చాలా పాషన్ వున్న నిర్మాత. మంచి కథ ఎక్కడున్నా వింటారు. హనుమాన్ లాంటి పెద్ద సినిమాని తీసే అవకాశం ఇచ్చిన ఆయనకు ధన్యవాదాలు. హనుమాన్ విడుదలకు సిద్ధమౌతున్న సమయంలో దర్శితో సినిమాని టేకప్ చేశారు. ఇంత మంచి కథని వదులుకోలేనని చెప్పారు. దర్శకుడు అశ్విన్ కి చాలా పాషన్, ఎనర్జీ వుంది. నభా లాంటి మంచి నటి ఈ ప్రాజెక్ట్ లో వుండటం అన్నీ సరిగ్గా సమకూరినట్లయింది. వివేక్ సాగర్ నాకు ఇష్టమైన కంపోజర్. టీం అందరికీ ఆల్ ది బెస్ట్. హను మాన్ ఎంత పెద్ద సక్సెస్ అయ్యింది డార్లింగ్ కూడా అంతటి పెద్ద విజయాన్ని సాధించి నిరంజన్ గారికి మంచి, డబ్బు రావాలని, ఇలాంటి మరెన్నో మంచి చిత్రాలు నిర్మించాలని కోరుకుంటున్నాను. నిర్మాత నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ.. ఈ వేడుకకు విచ్చేసిన ఇంద్రగంటి మోహన్ కృష్ణ, ప్రశాంత్ వర్మ. హర్ష, సునీల్ గారి ధన్యవాదాలు. మా టీం అందరికీ థాంక్స్. దర్శకుడు అశ్విన్ నమ్మినది అద్భుతంగా తెరపై తీసుకొచ్చారు. తప్పకుండా ఈ సినిమా ప్రేక్షకులని అలరిస్తుందని నమ్ముతున్నాం' అన్నారు. చిత్ర దర్శకుడు అశ్విన్ రామ్ మాట్లాడుతూ.. ప్రియదర్శి గారికి ఈ కథ చెప్పగానే తప్పకుండా చేద్దామని మాటిచ్చారు. మా కలలని నమ్మే వ్యక్తి కోసం ఎదురుచూశాం. నిర్మాత నిరంజన్ గారు మా కలల్ని సాకారం చేశారు. కథ చెప్పగానే నమ్మారు. శరవేగంగా సినిమాని చేశాం. ఆయన కంటెంట్ ని బలంగా నమ్మారు. చైతన్య గారికి కూడా ఈ కథ చాలా నచ్చింది. చెప్పినపుడు చాలా ఎంజాయ్ చేశారు. ప్రియదర్శి, నభా, టీం అందరితో పని చేయడం చాలా ఆనందాన్ని ఇచ్చింది. చాలా ఎంజాయ్ చేస్తూ ఈ సినిమా చేశాం. టీం అందరికీ ధన్యవాదాలు' తెలిపారు.



# ఆ రోజు వచ్చింది.. సంతోషంలో లావణ్య త్రిపాఠి

అందాల రాక్షసి సినిమాతో తెరంగేట్రం చేసిన ముద్దుగుమ్మ లావణ్య త్రిపాఠి తక్కువ సమయంలోనే టాలీవుడ్ ప్రేక్షకులతో నిజంగానే అందాల రాక్షసి ఈ అమ్మడు అనిపించుకుంది. తన అందంతో పాటు నటనతో మెప్పించి పలు సినిమాల్లో హీరోయిన్ గా నటించింది. అదృష్టం కలిసి రాకపోవడంతో ఈ అమ్మడు నటించిన సినిమాల్లో కొన్ని నిరాశ పరచడం, దాంతో ఆఫర్స్ తగ్గడం జరిగింది. అయినా కూడా నిరుత్సాహ పడకుండా సినిమాల్లో ప్రయత్నాలు చేస్తూనే వచ్చింది. మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ తో ప్రేమ వివాహం తర్వాత కూడా లావణ్య త్రిపాఠి కెరీర్ ను కొనసాగిస్తూ ఉంది. సోషల్ మీడియాలో రెగ్యులర్ గా అందాల ఆరబోత ఫోటోలు షేర్ చేస్తూ ఆకట్టుకునే లావణ్య త్రిపాఠి తాజాగా పింక్ కలర్ చీర కట్టి, మ్యాచింగ్ చెవి దిద్దులు పెట్టుకుని చిరు మందహాసం తో చూపరుల దృష్టిని ఆకర్షించింది. చీర కట్టు లో లావణ్య త్రిపాఠి ని చూస్తూ ఉంటే చూపు తిప్పకోలేకుండా ఉన్నాం అంటూ కొందరు కామెంట్స్ చేస్తున్నారు. ఈ ఫోటోకు లావణ్య ఇన్ స్టాగ్రామ్ లో... చిన్ననాటి జ్ఞాపకాలు, అమ్మ యొక్క పింక్ చెవి దిద్దులు లు ధరించాను. నేను ఎప్పుడెప్పుడా అంటూ ఎదురు చూస్తున్న రోజు వచ్చింది. ఇకపై ఇవి నావే అంటూ చాలా సంతోషంగా లావణ్య త్రిపాఠి కామెంట్ పెట్టింది. తల్లి చెవి దిద్దులను పెట్టుకున్న లావణ్య త్రిపాఠి మురిసిపోవడం చూసి నెటిజన్స్ కూడా ఫిదా అవుతున్నారు. తల్లిపై లావణ్య కు ఉన్న అభిమానం మరియు ప్రేమ ఇందులో కనిపిస్తున్నాయి అంటూ నెటిజన్స్ అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.